www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దినపత్రిక
శుక్రవారం 14 ఫిబ్రవరి 2025
సంపుటి :06 సంచిక : 257 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## మిగులు రాష్ట్రాన్ని అప్పలకుప్పగా చేశారు

- తెలంగాణ అప్పలపై రాజ్యసభలో నిర్మల ప్రస్తావన
- తెలంగాణకు చేసిన అభివృద్ధిపై ఏకరువు పెట్టిన మంత్రి

2 లో..

## హైదరాబాద్‌లో గూగుల్ ఎఐ సెంటర్ ఏర్పాటు

**సిఎం రేవంత్ సమక్షంలో కుదిరిన ఎంవోయూ**



**హైదరాబాద్,ఫిబ్రవరి13( వెలుతురు ):** హైదరాబాద్‌లో గూగుల్ ఎఐ సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు సిఎం రేవంత్ సమక్షంలో ప్రభుత్వంతో గూగుల్ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకుంది. టి హబ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సిఎం రేవంత్, ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాఉబ, సెక్రటరీ జయేశ్ రంజన్, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు. కృత్రిమ మేధతో పాటు అంకుర పరిశ్రమలకు గూగుల్ తోడ్పాటును అందించనుంది. వ్యవసాయం, విద్య,రవాణారంగం, డిజిటల్ రంగంలో గూగుల్ సహకారం అందిస్తుందని ఆ సంస్థ ప్రతినధులు ప్రకటించారు.



## కులగణనలో ఆదర్శంగా నిలిచిన తెలంగాణ

- సర్వేలో పాల్గొనని వారికోసం మరో ఛాన్స్
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**కరీంనగర్,ఫిబ్రవరి13( వెలుతురు ):** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే రాష్ట్రాలన్నింటికీ మార్గదర్శకంగా నిలిచిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొంత మంది

2 లో..

# గచ్చీబౌలి లో మైక్రో సాఫ్ట్ నూతన క్యాంపస్‌ను ప్రారంభించిన సీఎం

- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు.
- మైక్రో సాఫ్ట్ ఇండియా ప్రతినిధి రాజీవ్ కుమార్ తో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు
- 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంపస్ ఏర్పాటు
- 2,5 వందల మంది ఉద్యోగులు పని
- ఏ ఐ రంగంలో కొత్తగా 15 వేల కోట్ల పెట్టుబడులు






(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 13:** ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ గచ్చీబౌలిలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన కొత్త క్యాంపస్ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అధునాతన ప్రమాణాలతో నిర్మించిన ఈ భవనంలో 2,500 మంది ఉద్యోగులు పనిచేయడానికి వీలుంది.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి ముఖ్యమంత్రి కొత్త భవనం



ప్రారంభించగా, ఇదే సందర్భంగా మైక్రోసాఫ్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏఐ సిటీలో మైక్రోసాఫ్ట్ సరికొత్త ఏఐ సెంటర్ ను ఏర్పాటు చేస్తుంది. అలాగే, ఏఐ రంగంలో కొత్తగా రూ.15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది.హైదరాబాద్ ఏఐ సిటీ లో ఏఐ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 1.2 లక్షల

2 లో..

# అమెరికా చేరుకున్న ప్రధాని మోడీ

- రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా తదితరుల స్వాగతం
- ద్వైపాక్షిక సంబంధాలపై ట్రంప్‌తో చర్చలు
- ఎలన్‌మస్క్‌తో చర్చ
- చారిత్రక బ్లెయిర్ హౌజ్‌లో మోడీకి బస



**వాషింగ్టన్,ఫిబ్రవరి13( వెలుతురు ):** అమెరికాలో రెండు రోజుల పర్యటన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాషింగ్టన్‌కు చేరుకున్నారు. అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, ఇతర అధికారులు ప్రధాని మోదీని విమానాశ్రయంలో స్వాగతించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన కోసం గురువారం అమెరికాకు చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానం మేరకు ఆయన అమెరికా పర్యటన చేపట్టారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి, భారతదేశం-యుఎస్ఎ సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్మించడానికి ఎదురుచూస్తున్నాను. మన దేశాలు, మన ప్రజల ప్రయోజనం కోసం మెరుగైన భవిష్యత్తు కోసం కలిసి పనిచేస్తూనే

2 లో..

## బిఆర్ఎస్ పాలనలో యువతను మత్తులో ముంచారు

- క్యాసినో జూదానికి కేంద్రంగా చేశారు?,
- కెటిఆర్, సంతోష్ కనుసన్నల్లో ఫామ్‌హౌజ్ దందాలు,
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపణలు



**హైదరాబాద్,ఫిబ్రవరి13( వెలుతురు ):** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఫాంహౌజ్ కోళ్ళపందాల ఘటన దుమారం రేగుతోంది. బీఆర్ఎస్ హయాంలో కేటీఆర్, సంతోష్ కనుసన్న ల్లోనే పోచంపల్లి ఫాంహౌజ్ దందా

2 లో..

## క్షయ బాధితులకు అండగా ప్రభుత్వం



- క్షయ రహిత తెలంగాణ లక్ష్యం గా పనిచేస్తున్నాం.
- క్షయ వ్యాధి విస్తరించకుండా రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం స్క్రీనింగ్ కార్యక్రమాలు .
- క్షయ వ్యాధి బారిన పడిన బాధితుల చికిత్స కాలంలో 8 ఫార్మా కంపెనీలు తమ CSR నిధులతో న్యూట్రిషన్ కిట్స్ ను ఉచితంగా అందిస్తున్నాయి .
- క్షయ వ్యాధి బాధితులకు ప్రభుత్వం నుండి ఉచితంగా మందులు, ప్రతినెల చికిత్స కోసం వెయ్యి రూపాయల నగదును అందిస్తున్నాం.
- క్షయ వ్యాధి నిర్మూలనకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను, యాక్టివ్ కేస్ ఫైండింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నాం.
- వంద రోజుల పాటు క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్దేశించిన 9 జిల్లాలలో ఉధృతంగా కొనసాగిస్తున్నాం.
- క్షయ వ్యాధి బాధితులకు అండగా నిలిచి సాయం అందిస్తున్న 8 ఫార్మా కంపెనీల ప్రతినిధులకు ప్రశంసా పత్రాలను అందజేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ.

2 లో..

## ఢిల్లీలో అత్యాధునికంగా కేశవ్ కుంజ్

- ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం సిద్ధం
- త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు
- 19 నుంచి ప్రధాన కార్యాలయంలో కార్యకలాపాలు



2 లో..

## ఈనెల 19 న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ కార్యవర్గ సమావేశం

- ఈనెల 19 న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని కేటీఆర్ కు ఆదేశం
- పార్టీ స్థాపించి 25సంవత్సరాల నేపథ్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు
- భారీగా పార్టీ సభ్యత్వాల నమోదు
- పార్టీ నిర్మాణ కార్యక్రమాలను గూర్చి చర్చలు

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 13:** ఈనెల 19వ తేదీన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఆదేశించారు.పార్టీ అధినేత ఆదేశాల మేరకు ఈనెల 19వ తేదీన మధ్యాహ్నం నుండి హైదరాబాద్ లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ లో పార్టీ

2 లో..



## తమిళనాడుకు చేరుకున్న పవన్ కళ్యాణ్

- స్వామిమలై క్షేత్రంలో స్వామినాథన్ దర్శనం



**తంజావూరు,ఫిబ్రవరి13( వెలుతురు ):** దక్షిణ భారతదేశంలోని పుణ్యక్షేత్రాల పర్యటనలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్.. తన పుణ్య క్షేత్ర యాత్రలో భాగంగా తమిళనాడు రాష్ట్రంలోని తంజావూరు చేరుకున్నారు. కుంభకోణం సమీపంలోని స్వామిమలై క్షేత్రానికి వెళ్లిన ఆయన.. శ్రీ స్వామినాథ

2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## గచ్చీబౌలి లో మైక్రో సాఫ్ట్ నూతన క్యాంపస్‌ను ప్రారంభించిన సీఎం

మందికి పైగా అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో శిక్షణను అందించేందుకు మూడు కొత్త కార్యక్రమాలను మైక్రోసాఫ్ట్ చేపడుతుంది.అడ్వాంటేజ్ తెలంగాణ కార్యక్రమం కింద రాష్ట్రంలోని 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ కోర్సును పరిచయం చేసేందుకు మైక్రోసాఫ్ట్ ఏఐ ఫౌండేషన్స్అకాడమీప్రారంభిస్తుంది. దీని ద్వారా దాదాపు 50 వేల మందికి విద్యార్థులకు శిక్షణనిస్తుంది. ఏఐ- ఇండస్ట్రీ ప్రో పేరుతో మరో కార్యక్రమాన్ని చేపడుతుంది. రాష్ట్రమంతటా 20,000 మంది పరిశ్రమల నిపుణులకు నైపుణ్యాలను మెరుగుపరిచే శిక్షణనిస్తుంది.ఏఐ -సి ఓ ఈ ని ఏర్పాటు చేసి ఏఐ -గవర్న్ ఇనిషియేటివ్ పేరుతో రాష్ట్రంలోని దాదాపు 50 వేల మంది ప్రభుత్వ అధికారులకు ఏఐ , సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ప్రొడక్టివిటీ వంటి కీలకమైన రంగాలలో శిక్షణ ఇస్తుంది.అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధితో పాటు రాష్ట్రంలో హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్లలో తన పెట్టుబడులను రెట్టింపు చేస్తామని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. రాబోయే సంవత్సరాల్లో వీటికి అదనంగా రూ. 15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తు అంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వైపు పయనిస్తున్న సందర్భంలో హైదరాబాద్ లో మైక్రోసాఫ్ట్ కొత్త ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయడం అందరికీ గర్వకారణమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించడమే కాకుండా మరింత సాధికారత కల్పిస్తుందని చెప్పారు.మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల గత జనవరిలో హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చల ఫలితంగా తాజా ఎంఓయూ కుదిరింది. దీని ప్రకారం ప్రభుత్వ ఐటీ మరియు క్లౌడ్ మౌలిక సదుపాయాలనుఆధునీకరించడానికి, ఏఐ ద్వారా సేవలను విస్తృతం చేయడంలో మైక్రోసాఫ్ట్ పనిచేస్తుంది. “మైక్రోసాఫ్ట్‌కు నాయకత్వానికి అభినందనలు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌కు మధ్య విడదీయలేని సుదీర్ఘ అనుబంధం ఉంది. హైదరాబాద్‌లో కొత్త ఫెసిలిటీని ప్రారంభించడం మనందరికీ గర్వకారణం. హైదరాబాద్‌తో కలిసి చేస్తున్న ప్రయాణంలో ఇదొక మైలురాయిగా నిలుస్తుంది. హైదరాబాద్ నేడు ప్రపంచంలోనే టెక్నాలజీ పవర్ హౌస్‌గా, సరికొత్త ఆవిష్కరణలకు, ప్రపంచ ప్రతిభను ఆకర్షించే నగరంగా మారింది. మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యంతో భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉంటుంది. తెలంగాణపై నమ్మకం ఉంచిన మైక్రోసాఫ్ట్ నాయకత్వానికి ధన్యవాదాలు. మైక్రోసాఫ్ట్ నిబద్ధత తెలంగాణ రైజింగ్ విజన్‌కు తోడవుతుంది” అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ,పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ,మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ కుమార్ ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## కులగణనలో ఆదర్శంగా నిలిచిన తెలంగాణ

సర్వేలో పాల్గొనకుండా తమ సమాచారాన్ని ఇవ్వకపోవడంతో ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. భారాస నేతలు చెబుతున్నట్లు ఇది రీసర్వే కాదని పొన్నం స్పష్టం చేశారు. సర్వేలో పాల్గొనని భారాస నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యం మీద విశ్వాసం ఉంటే భారాస అగ్ర నేతలు సర్వేలో పాల్గొని తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. ‘భాజపా వ్యాపారులస్తుల అనుకూల పార్టీ. కులగణన, బీసీ, ఎస్సీ వర్గీకరణ ఆ పార్టీకి ఇష్టం లేదు. ప్రజల అకాంక్షలకి అనుగుణంగా తెలంగాణలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి. సర్వే పూర్తయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి. సామాజిక మార్పు కలిగించే నిర్ణయం ఇది. రాజకీయ విమర్శల కొసమే భాజపా నేతలు బీసీలు, ముస్లింలపై విమర్శలు చేస్తున్నారు. ముస్లిం కమ్యూనిటీలోని పేద ముస్లింలు బీసీలోనే కొనసాగుతున్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తాం. బలహీన వర్గాలపై చిత్తశుద్ధి ఉంటే శాసనసభలో బిల్లును అడ్డుకొవద్దు‘ అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

## అమెరికా చేరుకున్న ప్రధాని మోడీ

ఉంటాయి‘ అని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం తెల్లవారు జామున అమెరికాకు చేరుకున్నారు. ఫ్రాన్స్‌లో తన రెండు రోజుల పర్యటనను ముగించిన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి. వారు ప్రతినిధి స్థాయి ఫార్మాట్లలో ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహిస్తారు. గురువారం వాషింగ్టన్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో జరిగే సమావేశానికి ముందు మోడీ అదనపు సుంకాల కోతలకు సిద్ధమవుతున్నారు. ఇది భారతదేశానికి అమెరికన్ ఎగుమతులను పెంచవచ్చు. అధ్యక్షుడు ట్రంప్, డోజ్ అధిపతి ఎలాన్ మస్క్‌తో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా మోదీకి భారత సంతతి వారు ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రత్యేకమైన అతిథి గృహంలో బస చేస్తున్నారు. 1651 పెన్సిల్వేనియా అవెన్యూలోని బ్లెయిర్ హౌస్ ఆయనకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ భవనం శ్వేత సౌధానికి ఎదురుగా ఉండటం దీని విశేషం. అమెరికాలో పర్యటించే అత్యంత ప్రత్యేకమైన అతిథులకు ఇక్కడ బస ఏర్పాటు చేస్తారు. గతంలో చాలా మంది దేశాధ్యక్షులు, రాజకుటుంబ సభ్యులకు దీనిని విడిదిగా వాడారు. దౌత్యపరంగా ప్రాధాన్యమున్న భవనంగా దీనిని భావిస్తారు. ఇది కేవలం విలాసవంతమైన గెస్ట్‌హౌస్ మాత్రమే కాదు. అమెరికా ఆతిథ్యానికి చిహ్నంగా నిలిచింది. దాదాపు 70 వేల చదరపుటడుగుల్లో నాలుగు భవనాలు అనుసంధానమై ఉండటం దీని ప్రత్యేకత. ఇక్కడ మొత్తం 119 గదులు ఉన్నాయి. వీటిలో 14 బెడ్రూమ్‌లు, 35 బాత్ రూమ్‌లు, మూడు డైనింగ్ గదులున్నాయి. అత్యాధునిక బ్యూటీ సెలూన్ కూడా దీనిలో ఉంది. ఇక్కడి వచ్చిన అతిథులకు ఫైవ్‌స్టార్ ఆతిథ్యం ఇస్తారు. అమెరికా చరిత్రను తెలిపే పురాతన వస్తువులు, ఆర్ట్స్‌తో దీనిని అలంకరించారు. 1824లో ఈ భవనాలను నిర్మించారు. ప్రెస్టోన్ ఫ్రాన్సిస్ బ్లెయిర్ 1837లో కొనుగోలు చేశారు. ఆయన పేరును దీనికి పెట్టారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత శ్వేతసౌధానికి అతిథుల తాకిడి గణనీయంగా పెరిగింది. చాలా దేశాధినేతలు, సైన్యాధినేతలు అక్కడే బస చేసేవారు. ఆ తర్వాత 1942లో అమెరికా ప్రభుత్వం ఈ హౌస్‌ను అద్దెకు తీసుకొంది. ఆ ఏడాది చివరి నాటికి 1.56లక్షల డాలర్లకు కొనుగోలు చేసింది. అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆ దేశ డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బర్డ్‌తో భేటీ అయ్యారు. వీరిద్దరూ పలు అంశాలపై చర్చించారు. డీఎన్ఐగా ఆమె నేడు పదవీ బాధ్యతలు చేపట్టడం విశేషం.

## బిఆర్ఎస్ పాలనలో యువతను మత్తులో ముంచారు

నడిచిందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో యువతను మత్తు లో ముంచారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని క్యాసినో హబ్ గా కేటీఆర్ మార్చారని విమర్శించారు. బీఆర్ ఎస్ హయాంలో రాష్ట్రంలో రాక్షసపాలన సాగింది. కేటీఆర్ డ్రగ్స్ తో తెలంగాణను నాశనం చేశారు.. బినామీలకు క్యాసినో, కోళ్ల పందాలు అప్పగించారని అన్నారు. కేటీఆర్, సంతోష్ కుమార్ లకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి భాగస్వాములుగా ఉన్నారని చెప్పారు. బీఆర్ ఎస్ హయాంలో సన్ బర్న్ పార్టీల పేరుతో హైదరాబాద్ లో పాశ్చాత్య సంస్కృతిని తీసుకొచ్చిన చరిత్ర బీఆర్ ఎస్ నేతలదని విమర్శించారు. జన్వాడ ఫాం హౌ జ్ కేసులో డ్రగ్స్ ఇచ్చిన కేసులో పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి లిందని అనుమానాలు వ్యక్తం చేశారు. అన్నారు. ఫాంహౌజ్ లలో క్యాసినో, పేకాట, కోళ్ల పందేలు ఆడి స్తూ తెలంగాణ సమాజాన్ని జూదం వైపు మళ్లిస్తున్నారని అన్నారు. కేటార్ అండతోనే ఇలాంటి పనులు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ లో జరిగే అన్ని రకాల జూదాలకు కేటిఆరే నాయకుడు. బీఆర్ ఎష్ నేతలు ఏదో అవినీతిలో భాగస్వాములే అన్నారు. అందరిపైనా విచారణ జరిపి తెలంగాణ యువతను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ద

## తమిళనాడుకు చేరుకున్న పవన్ కళ్యాణ్

స్వామిని దర్శించుకున్నారు.. స్వామిమలై శ్రీ స్వామినాథ స్వామి వారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. షష్ట షణ్ముఖ క్షేత్ర యాత్రకు శ్రీకారం చుట్టారు. కంద షష్టి కవచ పారాయణంలో పాల్గొన్నారు.. ఆది ప్రణవనాదం ఓంకార మంత్ర రహస్యాన్ని సృష్టికి అందించిన క్షేత్రం.. షష్ట షణ్ముఖ క్షేత్రాల్లో ఐదవ క్షేత్రం స్వామిమలై.. ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా గురువారం తంజావూరు సమీపంలోని స్వామిమలైని సందర్శించారు పవన్.. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ అర్చకులు కన్నన్ గురుకల్.. సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.. పంచ హారతులిచ్చారు.. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ధ్వజస్థంభానికి మొక్కారు పవన్ కల్యాణ్.. ఇక, స్వామినాథ స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన కంద షష్టి కవచ పారాయణంలో పాల్గొన్నారు పవన్.. ఆయన కుమారుడు అకీరా నందన్, తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ ఆనంద్ సాయి ఈ క్షేత్రాన్ని దర్శించుకున్నారు.. స్వామినాథ స్వామి దర్శనానంతరం ఆలయంలో వెలసిన ఆదిదంపతులు సుందరేశ్వరన్ స్వామి, మీనాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కి డిప్యూటీ కమిషనర్ ఉమా దేవి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు..

# క్షయ బాధితులకు అండగా ప్రభుత్వం

**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 13:**
రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాదులోని తన నివాసంలో నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వం నిర్దేశించిన 9 జిల్లాలలో 8 ఫార్మా కంపెనీలు క్షయ బాధితులకు 2 కోట్ల 80 లక్షల రూపాయల విలువైన ఫుడ్ బాస్కెట్ (కిట్స్) ను తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో చికిత్స కాలం పూర్తి అయ్యేవరకు ప్రతి నెల న్యూట్రిషన్ కిట్స్ ను అందిస్తున్నందుకు మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా క్షయ బాధితులకు అండగా నిలిచి న్యూట్రిషన్ ఫుడ్ ను అందిస్తున్న కార్పొరేట్ ఫార్మా కంపెనీలైనా ఆరాజన్ ఫౌండేషన్, ఆప్టిమస్ డ్రగ్స్, బయోలాజికల్ - ఈ, గ్లాండ్ ఫార్మా, మెట్రో కెమ్, నాట్కో ఫార్మా, గ్రాన్యూల్స్, సన్ ఫార్మాసిటికల్ కంపెనీల ప్రతినిధులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ తన నివాసంలో ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫార్మా కంపెనీలు అందిస్తున్న ప్రోత్సాహాన్ని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో క్షయ నిర్మూలన లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. సిఎం రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు క్షయ వ్యాధి నిర్మూలన లో భాగంగా రాష్ట్రంలో అదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, కరీంనగర్, పెద్దపల్లి, మెదక్, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలలో (9 జిల్లాలలో) 100 రోజులపాటు క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను ఉదృతంగా నిర్వహిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అవగాహన, యాక్టివ్కేస్ ఫైండింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు.



క్షయ రహిత తెలంగాణ లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు. క్షయ వ్యాధి విస్తరించకుండా రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం స్క్రీనింగ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. క్షయ వ్యాధి బారిన పడిన బాధితుల చికిత్స కాలంలో 8 ఫార్మా కంపెనీలు తమ CSR నిధులతో న్యూట్రిషన్ కిట్స్ ను ఉచితంగా అందిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి బాధితులకు ప్రభుత్వం ఉచితంగా చికిత్స, మందులు, ప్రతినెల చికిత్స కోసం వెయ్యి రూపాయల నగదును అందిస్తున్నామన్నారు.వంద రోజుల పాటు క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్దేశించిన 9 జిల్లాలలో ఉధృతంగా కొనసాగిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి బాధితులకు అండగా నిలిచి సాయం అందిస్తున్న 8 ఫార్మా కంపెనీల ప్రతినిధులకు ప్రశంసాపత్రాలను మంత్రి దామోదర్ రాజనర్సింహ అందజేశారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్ వి కర్ణన్, డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ కమల్ హాసన్ రెడ్డి, టీబీ కంట్రోల్ డిప్యూటీ డైరెక్టర్ డా. రాజేశం, డ్రగ్స్ కంట్రోల్ డిప్యూటీ డైరెక్టర్ రామ్ దాన్, డాక్టర్ శ్రీగణ, డా. మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో అత్యాధునికంగా కేశవ్ కుంజ్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి13( వెలుతురు ):**
దేశ రాజధానిలో అత్యాధునికంగా నిర్మించిన ఆర్ఎస్ఎస్ కార్యాలయం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఎన్నో ఏళ్లుగా దీనిని పూర్త ఇచేసేందుకు శ్రమిస్తున్నారు. రూ.150 కోట్ల వ్యయంతో నిర్మించిన 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్' కార్యాలయ పనులు దాదాపు పూర్తికావడంతో కార్యకలాపాలను తిరిగి అక్కడకు మార్చారు. 3.75 ఎకరాల స్థలంలో ఉన్న పాత రెండంతస్తుల కార్యాలయం 'కేశవ్ కుంజ్' స్థానంలో అయిదు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో దీనిని నిర్మించారు. ఒక్కొక్కటి 13 అంతస్తుల్లో మూడు బ్లాకులు, 300 గదులు, కార్యాలయాలు, అధునాతన సమావేశ మందిరాలు దీనిలో ఉంటాయి.కరోనా అవాంతరాల వల్ల పనులు నిలిచిపోవడంతో ఇది పూర్తయ్యేందుకు ఎనిమిదేళ్ల సమయం పట్టింది. నూతన భవనం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 19న నిర్వహించబోయే కార్యకర్తల సమ్మేళనానికి సంఘ్ అగ్రనేతలు మోహన్ భాగవత్, దత్తాత్రేయ హొళసబలె హాజరవుతారు. గుజరాత్ ఆర్కిటెక్ట్ అనూప్ దేవ్ సారథ్యంలో రూపొందించిన ఈ అద్భుతమైన భవనం పేరు 'కేశవ్‌కుంజ్'. కొత్తగా నిర్మించిన ఈ భవనంలో అత్యాధునిక సదుపాయాలు, ఆకర్షణీయంగా నిర్మించిన మూడు 13 అంతస్తుల భవనంలో ఫిబ్రవరి 19 నుంచి పార్టీ కార్యకలాపాలు మొదలుకానున్నాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కొత్త హెడ్ క్వార్టర్స్ పేరు 'కేశవ్ కుంజ్'. మూడు హై రైజ్ టవర్లకు సాధన, ప్రేరణ, అర్చన అని పేరు పెట్టారు. 13 అంతస్థులున్న ఈ బిల్డింగుల్లో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన 300లకు పైగా గదులున్నాయి. దాదాపు 8 ఏళ్ల నిర్మాణం అనంతరం మళ్లీ ఆర్ఎస్ఎస్ ఇందులోకి ప్రవేశించింది. ఆర్ఎస్ఎస్ ఛీఫ్ మోహన్ భగత్ ఆధ్వర్యంలో ఈ నెల 19న కార్య సేవకుల సమావేశం అందులో జరగబోతోంది. ఆఫీస్ కార్యకలాపాలకు సాధన బిల్డింగ్,10 వ అంతస్తులో 8,500 పుస్తకాలతో లైబ్రరీ. ప్రేరణ టవర్ లో మొదటి అంతస్తులో హనుమాన్ టెంపుల్ ఉండగా అర్చన టవర్ కార్యసేవకులకు ఉద్దేశించింది. కొత్త భవనంలో 3 పెద్ద ఆడిటోరియాలు ఏర్పాటుచేశారు. అందులో ఒకటి విశ్వ హిందూ పరిషత్ నాయకుడు అశోక్ శింఘాల్ పేరిట 450 సీట్లతో నెలకొల్పగా.. 650 సీట్లు, 250 సీట్లతో మరో రెండు ఆడిటోరియం లను నిర్మించారు. ఎకో ఫ్రెండ్లీ బిల్డింగ్‌లో సోలార్ విద్యుత్, వుడ్ బదులు గ్రానైట్ ఫ్రేమ్స్ ఏర్పాటు చేశారు. ప్రేరణ, అర్చన టవర్ల మధ్య ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ హెగ్డెవార్ విగ్రహం నెలకొల్పారు. బీజేపీ సైద్దాంతిక గురువు ఆర్ఎస్ఎస్ హెడ్ క్వార్టర్స్ 1939 లో నాగ్‌పూర్‌లో తన కార్యకలాపాలను ప్రారంభించింది. 1961 లో దేశరాజధాని ఢిల్లీలోని చిన్న ఇంటికి మార్చింది. 1969, 1980లో ఒకటి, రెండు అస్తులను నిర్మించుకొని అందులోనే కార్యకలాపాలను కొనసాగిస్తూ వచ్చింది. మారిన అవసరాలు, పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని దాదాపు 4 ఎకరాల విస్తీర్ణంలో కొత్త భవనం నిర్మాణానికి 2018 లో మోహన్ భగత్ శంకుస్థాపన చేశారు. కేశవ్ కుంజ్ నిర్మాణానికి అయిన ఖర్చు అక్షరాలా రూ.150 కోట్లు. రూ.5 నుంచి మొదలుకుని 75వేల మంది ఈ నిర్మాణం కోసం విరాళాలు అందించారని సమాచారం.

## ఈనెల 19 న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ కార్యవర్గ సమావేశం

(మొదటి పేజీ తరువాయి..)
విస్తృత స్థాయి సమావేశం జరగనున్నది. అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత మరియు మాజీ ఎంపీలు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, మాజీ కార్పోరేషన్ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డిసిసిబి, డిసిఎంఎస్ అధ్యక్షులు పార్టీ నియోజకవర్గ ఇంచార్జీలతో కూడిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలియజేశారు. ఈ నెల 19 న నిర్వహించే ప్రత్యేక సమావేశంలో, బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం తదితర నిర్మాణాత్మక అంశాలపై విస్తృతస్థాయిలో చర్చించనున్నామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రధానంగా చర్చ జరగన్నది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా బీఆర్ఎస్ పార్టీశ్రేణులుచేపట్టవలసిన కార్యాచరణపై సమగ్ర చర్చ జరగనున్నది.ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకుంటూ, తమ హక్కులను తాము కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం కార్యకర్తలు శ్రేణులుఅనుసరించాల్సిన వ్యూహాలు విధానాలపై ఈ విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో చర్చించనున్నారని కేటీఆర్ తెలిపారు. సమగ్ర చర్చ జరిపి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే కీలక సమావేశం కాబట్టి ఆహ్వానితులందరూ ఖచ్చితంగా హాజరు కావాలని కేటీఆర్ స్పష్టం చేశారు.

## మిగులు రాష్ట్రాన్ని అప్పలకుప్పగా చేశారు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి13( వెలుతురు ):**
ఎపి విబజన సమయంలో మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ, ఇప్పుడు అప్పుల కుప్పగా మారిందని రాజ్యసభలో బడ్జెట్ పై చర్చ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రస్తావించారు. ఏపీ విభజన సమయంలో తెలంగాణ మిగులు రాష్ట్రంగా ఉందన్నారు. కానీ ఇప్పుడు అది అప్పుల కుప్పగా తయారైందని తెలిపారు. ‘నేను ఏ పార్టీని తప్పు పట్టడం లేదు. ఇందిరాగాంధీ గెలిచిన మెదక్ నియోజకవర్గంలో తొలుత రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసింది మోదీ ప్రభుత్వమేనని అన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించింది నరేంద్ర మోడీ ప్రభుత్వమే. ఎరువుల ఉత్పత్తిలో రికార్డు స్థాయిలో 12.7 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని పెంచాం అని అన్నారు. నిజామాబాదులో పసుపు బోర్డు ఏర్పాటు చేసిన ఘనత నరేంద్ర మోడీదే. అత్యద్భుతమైన పసుపు పండే ప్రాంతం నిజామాబాద్. తెలంగాణకు చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం జహీరాబాద్లో పారిశ్రామిక కారిడార్ను ఏర్పాటు చేసినందుకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని ఆమె వెల్లడించారు. వరంగల్లో పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కును ఏర్పాటు చేశామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి గుర్తు చేశారు. ‘సమ్మక్క సారక్క గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశాం. బీబీనగర్ లో ఎయిమ్స్ ఏర్పాటు చేశాం. 2605 కిలోమీటర్ల జాతీయ రహదారులను వేశాం. భారత్ మాల కింద నాలుగు గ్రీన్ కారిడార్లు ఏర్పాటు చేశాం. 5337 కోట్ల రూపాయల బ్జడెట్ను రైల్వేల అభివృద్ధి కోసం తెలంగాణకు కేటాయించాం. ఏరుపాలెం నంబూరు మధ్య , మల్కాన్ గిరి పాండురంగాపురం మధ్య 753 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాక్ నిర్మించాం. ఐదు కొత్త వందేభారత్ ట్రైన్లను తెలంగాణకు ఇచ్చాం. 40 రైల్వే స్టేషన్స్ రీడెవలప్ చేసాం. పీఎం ఆవాస్ అర్బన్ కింద రెండు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 31 లక్షల టాయిలెట్లను స్వచ్ఛ భారత్ మిషన్ కింద నిర్మించాం. జల్జీవన్ మిషన్ కింద 38 లక్షల నల్ల కనెక్షన్ ఇచ్చాం. 82 లక్షల ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను ఇచ్చాం. 199 జనఔషధి కేంద్రాలను ఏర్పాటు చేశాం.‘ అని నిర్మాల సీతారామన్ తెలిపారు.

# వల్లభనేని అరెస్ట్ కక్షపూరిత చర్య

- రాజకీయాల్లో ఇలాంటివి పనికిరావు
- మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

**విశాఖపట్టణం,ఫిబ్రవరి13( వెలుతురు ):**
వల్లభనేని వంశీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు.కేసు వెనక్కు తీసుకుంటే మళ్ళీ అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. కక్ష పూరిత రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదని.. ఇలాంటివి రాజకీయాలలో సరికాదని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నేత వల్లభనేని వంశీ పై మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించారు . గురువారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. ఋషికొండ భవనాలు ప్రభుత్వ కట్టడాలు.,. నిర్మాణాలలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను మండలిలో ప్రశ్నిస్తామని.. శాసనసభ విషయంలో పార్టీ వైఖరిని తమ వాళ్ళను అడిగి చెప్తానని.. తనకు తెలియని విషయాన్ని తెలుసుకొని చెప్తానని అనడంలో తప్పు లేదు కదా అని బొత్స అన్నారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువులు ధరలు పెరిగిపోతున్నాయని, పండగ కూడా బాగా చేసుకోలేకపోయారని బొత్స సత్యనారాయణ అన్నారు. ఇంకా వేసవి రాకుండానే పవర్ కట్స్ విధిస్తున్నారని, వైసీపీ హయంలో స్కూల్స్ మూసేసారని దుష్ప్రచారం చేశారని అన్నారు. ఇప్పుడు ÷ల్స్ క్లియరింగ్ ఎందుకు ఆలస్యం అవుతుందని స్వయంగా సీఎం చంద్రబాబు చెప్పారు కదా అని బొత్స ప్రశ్నించారు. ఇప్పటికీ ఒక సిలెండర్ మాత్రమే ఇచ్చారని...తల్లి కి వందనం ఇస్తామని అంటున్నారని.. రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవడం లేదని, నిరుద్యోగ భృతి ఏమైందని నిలదీశారు. గత 5 ఏళ్లలో జరిగిన దాని కంటే..ఈ 9 నెలల్లో ఎక్కువ జరిగాయని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వం తప్ప... చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. మండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తామన్నారు. గత టీడీపీ, వైసీపీ హయంలో భూకుంభకోణంపై వేసిన సిట్ నివేదికను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా, మచిలీపట్నంలో వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నానిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. వల్లభనేని వంశీ అరెస్ట్ నేపథ్యంలో డీఎస్పీ రాజా పేర్ని నాని ఇంటికి వెళ్లారు. శాంతి భద్రతల నేపథ్యంలో ఇంట్లో నుంచి బయటకు రావద్దని ఆయనకు విజ్ఞప్తి చేశారు. పేర్ని నాని హౌస్ అరెస్ట్ విషయం తెలుసుకున్న ఆయన అనుచరులు, వైసీపీ శ్రేణులు నాని ఇంటికి భారీగా చేరుకున్నారు. ఈ క్రమంలో పేర్ని నాని ఇంటి వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వల్లభనేని వంశీని హైదరాబాద్‌లో అరెస్టు చేసిన విజయవాడ పోలీసులు కృష్ణా జిల్లాకు తీసుకువచ్చారు. వంశీపై పటమట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. కృష్ణా జిల్లా నుంచి వంశీని పడమట పోలీస్ స్టేషన్‌కు తీసుకురానున్నారు. కాగా ఇప్పటికే స్పెషల్ పార్టీ పోలీసులు, ఎస్‌బీ, ఇంటెలిజెన్స్, స్థానిక పోలీసులు పడమట పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పడమట పోలీస్ స్టేషన్ ఇరువైపులా బార్ గేట్లను ఏర్పాటు చేశారు. డీసీపీ పర్యవేక్షణలో ఏసిపి, సిఐలు పోలీసులు అక్కడ ఇలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా రంగం సిద్ధం చేశారు. మరోవైపు ఇప్పటికే వంశీ ప్రధాన అనుచరులు సిఐడి కస్టడీలో ఉన్నారు.

# అవినాష్ కామర్స్ కాలేజ్ యాజమాన్యం పై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి. ఆనంద్ కు పిర్యాదు



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 13:**
అవినాష్ కాలేజ్ ల పై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గారికి తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ పిర్యాదు చేసారు, నిబంధనలకు విరుద్ధంగా కాలేజ్ నడుపుతూ, విద్యార్థుల, తల్లిదండ్రులపై, ప్రయివేటు సైన్యంను (బౌన్సర్స్)ను ఏర్పాటు చేసుకొని దౌర్జనానికి దిగుతున్నారు, ఆర్థిక ఇబ్బందుల వలన ఫీజు కట్టని విద్యార్థులను ఇంటర్నల్ ఎక్సమ్స్ రాయనివ్వకుండా ఫీజులను కట్టడానికి ఏమాత్రం సమయం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు, అదేకాకుండా తల్లిదండ్రులను మీ పిల్లల భవిష్యత్ మా చేతులల్ల ఉంది జాగ్రత్త అని బెదిరింపులకు దిగుతున్నారు, సమస్యను పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ హైదరాబాద్ గారికి పిర్యాదు అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో, మేకపోతుల నరేందర్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం,గణపతి బిక్కు మహరాజ్, ఆజాద్ సోషల్ జస్టిస్ పార్టీ వ్యవస్థపక అధ్యక్షులు, ఎర్ర శ్రీవారి గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను: దుర్గా

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువేళ్తా
- మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు దుర్గా



**మేడిపల్లి, వెలుతురు:-**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు తన వంతుగా కృషి చేస్తానని మేడ్చల్ జిల్లా మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన ఎన్ఎన్ కే దుర్గా తెలిపారు.. ఈ మేరకు గాంధీ భవన్ లో మహిళ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు రాజనాల లక్ష్మిల చేతుల మీదుగా మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా నియమకపు పత్రం అందుకున్న అనంతరం దుర్గా మాట్లాడుతూ.. పీర్జాదిగూడ కార్పొరేషన్ లో పార్టీ బలోపేతం కోసం కృషి చేశానని తెలిపారు.. భవిష్యత్తులో కూడా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.. ముఖ్యంగా మహిళలకు అందుతున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజలకు అర్దం అయ్యేలా వివరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిణిగా డా.సి.ఉమా గౌరీ



**మేడ్చల్ వెలుతురు ఫిబ్రవరి 13:**
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిణిగా నియమితులైన డా సి ఉమా గౌరి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ గౌతమ్ పోట్రు ఐఏఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## విశ్వావసు నామ సంవత్సర నూతన పంచాంగ ఆవిష్కరణ

**తూప్రాన్, వెలుతురు ఫిబ్రవరి, 13:**



తూప్రాన్ పట్టణానికి చెందిన యువ సిద్ధాంతి సోమయాజుల సాయిరాంశర్మ గడించిన రాబోయే విశ్వాస నామ సంవత్సర పంచాంగాన్ని నాచారం గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆలయ కార్య నిర్వహణాధికారి శ్రీపార్నంది విశ్వనాథ శర్మ గురువారం రోజు సంప్రదాయ బద్ధంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ లలితా సేవాసమితి వ్యవస్థాపకులు దేవి ఉపాసకులు బ్రహ్మశ్రీ సోమయాజుల రవీంద్ర శర్మ, ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు పాల్గొన్నారు.

## డివిజన్ లో 67 లక్షల బడ్జెట్ తో శివరేజ్, వాటర్ వర్క్స్ పైప్లైన్ పనులను ప్రారంభించిన హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 13:**
గురువారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ లోని రాజ్ మొల్లాహ్ , స్ట్రీట్ నెంబర్ 6, హైదర్గూడా, మరియు అవంతి నగర్ లో దాదాపు 67 లక్షల బడ్జెట్ తో శివరేజ్ మరియు వాటర్ వర్క్స్ పైప్లైన్ పనులను హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ గారి ఆదేశాల మేరకు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం ఉమాశంకర్ మరియు మేనేజర్ సుబ్బయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి రామన్ గౌడ్,అశోక్, ప్రసాద్, ప్రభాకర్, జాకి, సాయి, శివ యాదవ్, సీతారాం రెడ్డి, జోసెఫ్, బస్తీ అండ్ కాలనీ మెంబెర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్లు చేయిస్తూ ఆత్మీయ పలకరింపు

- నియోజకవర్గం లో ప్రతి ఒక్కరికి కంటిచూపు బాగుండాలని వైద్య శిబిరాలు
- స్వయంగా అసువత్రి కి వెళ్లి కన్న కొడుకు లాగా బాగోగులు చూసుకుంటున్న రాజ్ గోపాల్ రెడ్డి
- నిరంతర ప్రక్రియ గా కొనసాగుతున్న వైద్య శిబిరాలు
- ఇప్పటికే 1371 మందికి వైద్య పరీక్షలు చేసి 324 మందికి కంటి ఆపరేషన్ లు పూర్తి
- నియోజకవర్గం లో ఏ ఒక్కరూ కంటి సమస్య తో బాధ పడవద్దు
- సామాజిక సేవలో వున్న సంతృప్తి దేంట్లోను లేదు ఆ సంతృప్తి గొప్ప అనుభూతినిస్తుంది.
- కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి




**మునుగోడు వెలుతురు ఫిబ్రవరి 13:**
మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి తల్లికి ప్రతి తండ్రికి కన్నకొడుకు లాగా మారి కంటి ఆపరేషన్లు చేయిస్తున్నారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు నియోజకవర్గంలో కంటిచూపుతో బాధపడుతున్న ఏ ఒక్కరు ఇబ్బంది పడొద్దంటూ ఉచిత కంటి వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారు.. ఈ వైద్య శిబిరాలు నిరంతర ప్రక్రియ లాగా కొనసాగిస్తున్నారు.. జనవరి 19 న మొదటి విడత వైద్య శిబిరానికి అనూహ్యమైన స్పందన వచ్చింది ఆ రోజు 1058 కి వైద్య పరీక్షలు నిర్వహించగా 216 మందికి ఆపరేషన్లు పూర్తి చేశారు... ఆపరేషన్లు చేయించి అలాగే వదిలేయకుండా మరలా వారికి వైద్య పరీక్షలు చేయించి కంటి పనితీరు ను పరిశీలించారు...
ఫిబ్రవరి 9న మరొక 313 మంది కి వైద్య పరీక్షలు నిర్వహించి 108 మందికి కంటి పరీక్షలు చేయించారు..బిజీ షెడ్యూల్ లో కూడా హైదరాబాదులోని శంకర కంటి ఆసుపత్రి లో ఆపరేషన్ చేసిన ప్రతి ఒక్కరిని పేరుపేరునా ఆత్మీయంగా పలకరించి మీకు నేనున్నాను అనే భరోసా కల్పించారు.....

## హయత్ నగర్ లో పీడీఎస్ బియ్యం పట్టివేత

- సీఐ నాగరాజు గౌడ్
- ముగ్గురు వ్యక్తులు అరెస్ట్
- 58 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత
- బంజారా కాలనీ లో జరిగిన సంఘటన








**వెలుతురు, హయత్ నగర్, ఫిబ్రవరి 13:**
రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంజారా కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని హయత్ నగర్ సీఐ పల్స నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో గోదాం పై దాడి చేసి పట్టుకున్న వైనం ఇది, హయత్ నగర్ బంజారా కాలనీ లోని ప్లాట్ నంబర్ 47 లో ఎం డి మోసిన్, సలీం, శ్రీకాంత్ కలిసి ఓ ముఠా గా ఏర్పడి పీడీఎస్ బియ్యం ను అక్రమంగా తక్కువ ధరలకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు, ఈ వ్యవహారంలో 58 బస్తాల పీడీఎస్ బియ్యం బ్యాగ్లను, 3 ద్విచక్రవాహనాలతో పాటు వెయిటింగ్ మిషన్లు ఇతర పరికరాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు,

## సినిమా థియేటర్లలోకి పిల్లల ప్రవేశం

- సింగిల్ బెంచ్ తీర్పుపై హైకోర్టులో సవాల్

**హైదరాబాద్,ఫిబ్రవరి13( వెలుతురు ):**
సినిమా థియేటర్లలోకి పిల్లల ప్రవేశంపై తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ మల్టీప్లెక్స్ యాజమాన్యాల సంఘం పిటిషన్ దాఖలు చేసింది. పదహారేళ్లలోపు పిల్లల్ని రాత్రి 11గంటల నుంచి ఉదయం 11 గంటల్లోపు థియేటర్లలోకి అనుమతించవద్దని ఇటీవల హైకోర్టు ఆదేశించింది. దీనిపై అన్ని వర్గాలతో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ మల్టీప్లెక్స్ యాజమాన్యాల సంఘం అప్పీలు దాఖలు చేసింది. ఈ నిర్ణయం వల్ల మల్టీప్లెక్స్ థియేటర్ల యాజమాన్యం తీవ్రంగా నష్టపోతుందని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. సింగిల్ బెంచ్ వద్ద పిటిషన్ పెండింగ్‌లో ఉండగా.. అప్పీలుపై జోక్యం చేసుకోలేమని సీజే ధర్మాసనం స్పష్టం చేసింది. సింగిల్ బెంచ్ వద్ద ఉన్న పెండింగ్ పిటిషన్‌లో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయాలని సూచించింది. దీనికి పిటిషనర్లు అంగీకరించడంతో అప్పీల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.



## మార్గదర్శకం..!”

రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 13

మానవ జన్మం మనిషికి ఓ వరం
కానీ...ఈ మనుష్య లోకంలో
ఎన్ని రకాల మనుషులున్నారో
అన్ని రకాల స్వభావాలున్నాయి
చుట్టూ జరిగే ఒక్కో సంఘటన
ఒక్కో మనిషితో ఒక్కో తీరటనా
అర్థమై ఒక్కో విధంగా స్పందించేనూ
ఏ... మనిషైనా సరే..
వార్ధక్యం వచ్చినా.. రాకపోయినా..
మానవ జన్మకు సార్థకతే లేనిదాయే
పైకంతో ఏపనైనా చేయొచ్చేమో.. కానీ
ఆనందాన్నీ తయారూ చేయలేమూ
మంచి వైద్యులనూ కొనొచ్చేమో.. కానీ
మంచి ఆరోగ్యాన్ని కొనుక్కోలేమూ..
మంచి చేయకపోయినా సరే..
సాటి వారికీ.. చెడు చేయొద్దూ..
ఒకరినుంచి... తీసుకోవడమే కాదూ
ఇవ్వడమూ.. నేర్చుకోవాలీ...
సాటి జీవుల పట్ల ప్రేమ,దయా..
నిస్సహాయులకూ సహాయమవ్వాలీ
సంపాదనలో కొంతా.. దానం చేయాలీ ఆపదల్లో
ఉన్నవారినీ ఆదుకోవాలీ
సమస్యలా వలయంలో ఉన్నవారికీ..
తగ్గట్టుగా సలహా సూచనలివ్వాలీ
ఈ పరమ సత్యాన్నీ.. గ్రహించనీ..
ఆదర్శ జీవనాన్నీ.. ఆచరించనీ..
మానవ జన్మమే.. అర్థం లేనీ వ్యర్థం..
చుట్టున్న చీకట్లనూ.. తొలగించుకుంటూ
మంచి యోచనతో.. నిండుగ ఉంటూ..
నడవాలీ.. నలుగురికీ మార్గదర్శకం!
సాగాలీ.. జీవనమే.. ఆనంద దాయకం!!



**పాల్వంచ హరికిషన్**
9502451780

## అనుమతి లేని హోర్డింగ్‌లపైనా హైడ్రా కన్ను

- కోమటికుంటలో అక్రమ కట్టడాల తొలగింపు

**హైదరాబాద్,ఫిబ్రవరి13( వెలుతురు ):**
ఆక్రమణలకు గురైన చెరువులను పునరుద్ధరించేందుకు కీలకంగా వ్యవహరిస్తోన్న హైడ్రా.. అనుమతిలేని హోర్డింగ్‌లపై దృష్టి సారించింది. శివారు మున్సిపాలిటీలైన శంషాబాద్, కొత్వాల్‌గూడ, నార్సింగి, తొండుపల్లి, గొల్లపల్లి రోడ్డు, తెల్లాపూర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటి వరకు 53 భారీ హోర్డింగ్‌లను హైడ్రా సిబ్బంది తొలగించారు. మరో వైపు యాడ్ ఏజెన్సీ ప్రతినిధులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమావేశమయ్యారు. అనుమతిలేని హోర్డింగ్‌లను తొలగిస్తామని హెచ్చరించారు. ఇదిలావుంటే తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజల్ గ్రామంలోని కోమటి కుంటలో గురువారం హైడ్రా అక్రమ కట్టడాలను తొలగించింది. కోమటికుంట ఎఫ్‌టీఎల్ లో నిర్మాణాలపై హైడ్రాకు స్థానికులు ఫిర్యాదులు చేశారు. హైడ్రా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులతో పూర్తి స్థాయి విచారణ చేపట్టింది. కోమటి కుంట చెరువు పరిధిలో నిర్మించిన ప్రకృతి రిసార్ట్స్, ప్రకృతి కన్వెన్షన్ కు ఎలాంటి నిర్మాణ అనుమతులు లేవని వెల్లడింది.. అలాగే చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఈ నిర్మాణాలు జరిగినట్టు విచారణలో తేలడంతో కూల్చివేతలకు ఆదేశించింది. హైడ్రా నోటీసులపై ప్రకృతి రిసార్ట్స్, ప్రకృతి కన్వెన్షన్ ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన వాటిని కూల్చివేయాలంటూ హైకోర్టు తీర్పు ఇచ్చింది.. తామే తొలగిస్తామని.. 30 రోజుల సమయం కావాలని హైకోర్టును ప్రకృతి రిసార్ట్స్ నిర్వాహకులు కోరారు.. 30 రోజులు దాటినా వాటిని తొలగించకపోవడంతో..నేరుగా రంగంలోకి దిగి కూల్చివేతలు చేపట్టారు.

# సంపాదకీయం..

## ఉచిత పథకాలపై కనువిప్పు కలిగేనా ?

ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరిక, ప్రజలకు ముఖ్యంగా రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలతో ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. లక్షల కోట్లు అప్పులు చేసి, వడ్డీలు కట్టలేక, జీతాలు చెల్లించలేక, కనీసం ఓ రోడ్డు కూడా సక్రమంగా వేయలేక చతికిల పడుతున్నాయి. దీనికితోడు ప్రభుత్వాలు కూడా దుబారా తగ్గించుకోవాలి. ఈ విషయంలో జాతీయస్థాయి చర్చ సాగాలి. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తున్నారు. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించింది. ఇది పాటిస్తారా లేదా అన్నది చూడాలి. అయితే ఇలా ఎంతకాలం ఇస్తారన్నది ప్రజలు కూడా ఆలోచన చేయాలి. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ , ఉచితంగా బస్సు ప్రయాణం.. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రకాలుగా ప్రజలు తమను తాము రాజకీయ నాయకులకు ఓట్లుగా అమ్ముకోబడుతున్నారు. ఇది ప్రజలకు మంచిది కాదు. రాజకీయ నాయకులు ఉచిత పథకాలను నిలదీయగలగాలి. రాజ్యాంగ పరంగా ఇలాంటి వాటిపైనా ఆంక్షలు ఉండాలి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సుప్రీం తీర్పు నేపథ్యంలో ఉచిత పథకాల పందేరాన్ని ఆపాలి. సంక్షేమం పేరుతో ప్రజలను చేష్టలుడిగేలా చేయడం సరికాదు. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవాలి. ప్రజలకు స్వీట్ల మాదిరి ఉచితాలను పంచిపెడుతూ పోతే ఆధునిక భారత దేశం అంధకార యుగంలోకి జారిపోతుందని గతంలో ఓమారు ప్రధాని మోడీ సెలవిచ్చారు. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్‌ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేం అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2022 జూలై 16న యూపీలో బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభిస్తూ హెచ్చరించారు. ఆనాడు దీనిని అనేకులు విమర్శించారు. మోడీకి సంక్షేమం పట్ల శ్రద్ధ లేదన్నారు. అయితే మోడీ ఇలా చెప్పినప్పుడు పాటించివుంటే బాగుండేది. కానీ ఆ తర్వాత ఏడాదే మధ్యప్రదేశ్‌లో లాడ్లీ బెహనా పథకం క్రింద మహిళలకు నెలకు రూ.1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ. 3వేల వరకు పెంచుతామని బీజేపీ ప్రకటించింది. మొన్న మహారాష్ట్రలో కూడా ఇదేవిధంగా ఇలాంటి పథకాన్నే ప్రకటించారు. మధ్యప్రదేశ్‌లోనే కాదు, ఆ తర్వాత ప్రతి రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఉచితాల మీద ఉచితాలను ప్రకటిస్తూ ఎన్నికల్లో ప్రయోజనం పొందింది. దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కనీవినీ ఎరుగని స్థాయిలో ఉచితాల హామీలను ప్రకటించింది. దీన్నిబట్టి చూస్తే మోడీయేనా ఉచితాలను వ్యతిరేకించింది అని ఆశ్చర్యం కలుగక మానదు. ఉచిత పథకాలు వద్దనుకున్నప్పుడు అందుకు కార్యాచరణ చేయాలి. ప్రజలను ఉచిత ఊబిలో పడకుండా చేయాలి. అభివృద్ధితో వారిని ముందుకు తీసుకుని వెళ్లాలి. ఉచిత పథకాల సంస్కృతి కారణంగా దేశ, రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖజానాపై విపరీతంగా భారం పడుతుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇది తెలిసినా ఏ రాజకీయ పార్టీ కూడా ఉచితాలను ప్రకటించేందుకు వెనుకాడడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 43 ఏళ్ల క్రితం ప్రారంభం అయిన కిలో రెండు రూపాయాల బియ్యం పథకాన్ని ఇప్పుడు కిలో రూపాయికే ఇవ్వడం వెనక సామాజిక ఉద్దరణ, పేదరిక నిర్మూలనకన్నా ఓట్ల బేరమే దాగివుంది. కిలో బియ్యం పథకం పెద్ద మాఫియాగా మారినా విజినరీ చంద్రబాబు చర్యలు తీసుకోవడం లేదు. ఉచితాలను సమర్థంగా అమలు చేస్తే అధికారంలోకి తప్పకుండా రాగలం అన్న నమ్మకంతో ఆమ్ ఆద్మీ పార్టీ రాజకీయ మొదలు పెట్టింది. మంచినీరు, విద్యుత్, ఆరోగ్యం, విద్య, మహిళలకు బస్సు ప్రయాణం, వృద్ధులకు తీర్థ యాత్ర.. ఇలా ప్రతి రంగంలోనూ ఉచితాలను ప్రవేశపెట్టి అమలు చేయడం ద్వారా 2013 నుంచి ఇప్పటి వరకూ ఆప్‌కు ఎన్నికల్లో తిరుగులేకుండా పోయింది. అంతకు మించి బిజెపి హామీలు ఇవ్వడంతో ఇప్పుడు ఢిల్లీలో కొట్టుకు పోయింది. ఎపిలో జగన్ సర్కార్ అన్నీ ఉచితాలే ప్రకటించింది. ప్రతిరోజూ ఏదో రూపంలో బటన్ నొక్కడమే పనిగా పెట్టుకున్నారు. అయినా ప్రజా తీర్పులో కొట్టుకు పోయారు. అయనేమీ నష్టపోలేదు. ఎపిని 7 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. తెలంగాణలో కెసిఆర్ కూడా దాదాపు ఇలాగే పథకాలు ప్రకటించి తనకు తిరుగులేదని నిరూపించుకున్నారు. ఆయనా కొట్టుకుపోయారు. ఇప్పుడు కాంగ్రెస్ కూడా ఉచిత బస్సు మొదలు అనేక పథకాలను కొనసాగిస్తోంది. ఆదాయం వడ్డీలకే సరిపోవడం లేదని రేవంత్ ప్రభుత్వం వాపోతోంది. అయినా సమీక్షించుకునే ధైర్యం చేయడం లేదు. నగదు బదిలీల వల్ల ప్రజల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత తోడ్పడుతుందనే వాదన ఒకటి ఉన్నది. అయిత నిరుత్పాదక వ్యయం వల్ల జరిగే నష్టాలు అన్నీ ఇన్నీ కావు. ప్రజలకు చేతినిండా పని కల్పించలేని ప్రభుత్వాల అసమర్థత వల్ల ఆర్థిక వ్యవస్థకు ఎంత మేరకు నష్టం జరుగుతుందో, దాని వల్ల సమాజంలో జరిగే నష్టాలు ఎన్నో కూడా ఊహించవచ్చు. కొందరికి లభించే ఉచితాల కోసం జిఎస్టీ లాంటి పన్నుల రూపంలో మరికొందరు చెల్లించాల్సి వస్తుంది. వేలకోట్లు బ్యాంకులకు అప్పులు బాకీపడిన, విదేశాలకు పరారైన, కోట్ల రూపాయలు పన్నులు ఎగ్గొట్టిన, రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చిన సంపన్నులు మాత్రం ఈ ఉచితాలను భరించడం లేదన్నది మాత్రం వాస్తవం. ఉచిత పథకాలతో ప్రజల్లో కష్టపడే తత్వం పోతోందని, వారు పనులకు దూరంగా ఉంటున్నారని, రాజకీయ పార్టీల ఉచిత పథకాలను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు ఉచితాలను ప్రకటించే పద్ధతి మంచి కాదని వ్యాఖ్యానించింది. ఉచిత పథకాలు మంచివి కావు. దురదృష్ట వశాత్తూ.. వీటి కారణంగా ప్రజలు కష్టపడి పని చేసేందుకు ఇష్టపడడం లేదు. ఉచితంగా రేషన్, డబ్బులు అందుతున్నాయి. ఎలాంటి పని చేయకుండానే డబ్బులు వస్తుండటంతోనే ఇలా జరుగుతోంది. ప్రజలకు సౌకర్యాలు అందించాలన్న ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే. కానీ, వారిని దేశ అభివృద్ధిలో భాగం చేయాలే తప్ప సోమరులను కాదన్న రీతిలో వ్యాఖ్యానించింది. ఎన్నికల్లో ఉచిత పథకాలు ప్రకటించే పద్ధతి సరైనది కాదని జస్టిస్ బీఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా అయినా ప్రధాని మోడీ ఉచిత పథకాలకు అడ్డుకట్ట వేసేలా ముందుకు రావాలి. ఎక్కడో ఒకచోట్ దీనికి ముగింపు పలికితే మంచిది.

# ఢిల్లీలో కేజ్రీవాల్ ఉచిత హామీల చిట్టా అబ్బో..

- అంతకు మించి అన్నట్లు బిజెపి హామీల చిట్టా
- అధికారంకోసం ఎంతకైనా తెగిస్తారని గుర్తించాలి
- ఖజానాను దివాళా తీసేలా సిఎంల పాలన



న్యూఢిల్లీ,ఫిబ్రవరి13( వెలుతురు ):


ఢిల్లీ సిఎంగా ఉన్న సమయంలో కేజ్రీవాల్‌ఉచిత పథకాల పేరుతో పంపదేరం సాగించారు. అందుకే తనకు తిరుగులేదని నిరూపించారు. పంజాబ్‌లో కూడా ఇదే ఎత్తుగడతో అధికారం దక్కించుకున్నారు. తనకు తిరుగులేదనుకున్న కేజ్రీవాల్ తన ఇంటిని అద్దాలమేడగా తీర్చి దిద్దుకున్నారు. తనకు తిరుగు లేదని, బటన్ నొక్కడం వల్ల ప్రజలంతా తనకే ఓటేస్తారని ఎపిలో జగన్ కూడా నమ్మారు. అందుకే విశాఖ రుషికొండలో అత్యాధునిక సౌధాలు నిర్మించుకున్నారు. మళ్లీ తానే సిఎంను అవుతానని, విశాఖ నుంచి పాలిస్తానని ప్రకటించుకున్నారు. ప్రజలు ఓడించారు.. లేకుంటే ఎపి మరింత దోపిడీకి గుయ్యేది. తెలంగాణలో కూడా ఇలాగే కెసిఆర్ ఓడిపోయి ఫామ్‌హౌజ్÷-కే పరిమితం అయ్యారు. ఉచిత పథకాలతో ప్రజలనుమచ్చిక చేసుకుని, అభివృద్ధిని అటకెక్కించిన ఈ ముగ్గురు నేతలు వరుసగా పరాజయం పొందారు. ఈ ముగ్గురి దారి ఒకటేనని ఇప్పుడు అర్థం చేసుకోవచ్చు. ముగ్గురూ అధికారం కోసం అనేక పథకాలు ప్రకటించారు. అభివృద్ధిని దారి మళ్లించారు. ప్రజలను నమ్మించి నట్టే ముంచారనడం లో సందేహం లేదు. వీరి కారణంగా ఆయా రాష్ట్రాలు దివాళా తీసాయి. ఇకపోతే ఢిల్లీ బడ్జెట్ రూ. 76 వేల కోట్లు అయితే ,అందులో దాదాపు రూ. 15వేల కోట్లకు పైగా ఉచితాలకు, సబ్సిడీలకే ఖర్చవుతుందని, రూ. 8,159 కోట్ల మేరకు బడ్జెట్ లోటు ఏర్పడుతుందని లెక్కలు తేలాయి. పెద్ద ఎత్తున అప్పులు చేయక తప్పదని తెలిసి కూడా కేజ్రీవాల్ తిరిగి అధికారంలోకి రావడానికి ప్రజలకు అనేక హామీలను కురిపించారు. జాతీయ చిన్నపొదుపు మొత్తాల నిధి నుంచి కూడా ఆప్ ప్రభుత్వం అప్పులు చేసి రోజువారీ ఖర్చులను భరించాల్సి వచ్చింది. మహిళలకు ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన క్రింద నెలకు రూ. 2100 చొప్పున నగదు బదిలీ చేస్తామని, ఆలయాలు, గురుద్వారాల్లో పూజారులకు నెలకు రూ. 18వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తామని, ఆటోడ్రైవర్లకు, వారి కుటుంబ సభ్యులకు కూడా బీమా, వివాహాలు, స్కూలు యూనిఫారంల రూపంలో ఆర్థిక సహాయం అందిస్తామని, ఢిల్లీలో అద్దె గృహాలలో ఉన్న వారందరికీ ఉచిత విద్యుత్, నీరు సరఫరా చేస్తామని మొన్నటి ఎన్నికల్లో ఆప్ అధినేత కేజ్రీవాల్ హామీలు ప్రకటించారంటే.. ఆయన అధికార కండూతి ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేజ్రీవాల్ కంటే ఒక అడుగు ముందుకు వేసి మహిళలకు రూ. 2500 చొప్పున నెలకు చెల్లిస్తామని, గర్భిణీ స్త్రీలకు రూ. 21వేలతో పాటు ఆరు పోషకాహార కిట్లను పంచిపెడ్తామని బీజేపీ ప్రకటించింది. ఢిల్లీ మాత్రమే కాదు, ఇప్పుడు యావద్దేశమూ ఉచితాల బాటలో పయనిస్తోంది. 2024-25లో 9 రాష్ట్రాలు మహిళలకు నగదు బదిలీ క్రింద రూ. లక్ష కోట్లు ఖర్చు పెట్టాయని చట్టసభల పనితీరును అధ్యయనం చేసే పీఆర్ఎస్ పరిశోధనా సంస్థ వెల్లడించింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కో రాష్ట్రం ఒక్కో విధంగా ఉచితాలతో సాగుతున్నాయి.

రాష్ట్రం ఏమైనా ఫర్వాలేదన్న ధోరణిలో అధికారమే అంతిమ లక్ష్యంగా పార్టీలు ఎజెండాలు ప్రకటించుకుంటున్నాయి. కేంద్ర ఆర్థిక పరిస్థితి కూడా అంత సవ్యంగా ఏమీ లేదు. ఈ ఆర్థిక సంవత్సరాంతా నికి మార్కెట్ అప్పులతో సహా కేంద్రం అప్పులు రూ. 185 లక్షల కోట్లకు చేరుకోబోతున్నాయి. జీడీపీలో 56.8 శాతం దేశం అప్పులే ఉన్నాయి. ప్రతి ఏడాదీ రూ. 30 లక్షల కోట్లు ప్రభుత్వం అదనంగా అప్పులు చేయాల్సి వస్తున్నది. రాష్ట్రల పరిస్థితి కూడా ఇంతకంటే దారుణంగా ఉన్నది. ఎన్నికల్లో గెలిచేందుకు రకరకాల ఉచితాలను ప్రకటించిన ప్రభుత్వాలు వాటిని అమలు చేయడం కోసం నానా కష్టాలు పడాల్సి వస్తోంది. దేశం సంపదలో 40 శాతం పైగా కేవలం ఒక శాతం సంపన్నులు కబళించినట్లు లెక్కలు చెబుతున్నాయి. కార్పొరేట్లకు, సంపన్నులకు రుణాలను రద్దు చేయడం, భారీ ప్యాకేజీని ప్రకటించడం, కొంతమంది సంపన్నులకు అనుకూలంగా విధానాలను రూపొందించడాన్ని మానుకోవాలి. నిజానికి ఉచితాలను అమలు చేస్తున్న పార్టీలు రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు పన్నుల రూపంలో తిరిగి ప్రజల జేబులు కొడుతున్నాయి.

ఈ దుర్మార్గాన్ని సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. ఉచితాల వల్ల జరిగే భారీ వ్యయాన్ని భరించేందుకు ఆర్థిక లోటు లక్ష్యాలను, పెట్టుబడి, రెవిన్యూ వ్యయాలను, మౌలిక సదుపాయాల కు పెట్టే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం సవరించాల్సి వస్తోంది. సబ్సిడీల వల్ల కొన్ని సందర్భాల్లో పెట్టిన ఖర్చు తిరిగి వస్తుంది. కాని ఉచితాలు ఎప్పటికీ తిరిగి రావు. ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ సేవలు అందించడాన్ని అభివృద్ధికి ససూచికలుగా చూడాలి. ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యవంతం కావడానికి తోడ్పడతాయి. సంక్షేమ వ్యయం, సబ్సిడీలు, ఉచితాలకూ మధ్య సరిహద్దులు రోజురోజుకూ చెరిగిపోతున్నాయి. సమాజంలో అట్టడుగు వర్గాలకు చేయూత నిచ్చేందుకు, విద్యను, నైపుణ్యాన్ని పెంపొందించేందుకు, ఆరోగ్య సంరక్షణ కల్పించేందుకు మాత్రమే సహాయం చేయాలన్న నిబంధనను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. అందుకే ఎంతకాలం హేతుబద్ధత లేకుండా ఈ ఉచితాలను కొనసాగిస్తారని సుప్రీంకోర్టు కూడా ప్రశ్నించింది. జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతి వంటివి వల్లిస్తున్న బీజేపీ ముందుగా ఇలాంటి ఉచతి పథకాల నిరోధనానికి చర్యలు తీసుకోవాలి.

# వ్యవసాయరంగం పురోగమిస్తేనే అభివృద్ధి

- వ్యవసాయోత్పత్తుల దిగబడులు తగ్గాలి
- వ్యసాయాధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలి



న్యూఢిల్లీ,ఫిబ్రవరి13( వెలుతురు ):

దేశంలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తేనే అర్థికవ్యవస్థ బలోపేతం కావడంతో పాటు, దేశంలోని ప్రజలకు తిండిగింజలకు కొదవ లేకుండా పోతోంది. అలా చేయలేనంత కాలం ఈ దేశం ఆర్థికంగా పురోగమించదని నిపుణులు పదేపదే సూచిస్తున్నా..అందుకు అనుగుణంగా అడుగులు వేయడం లేదు. దేశ జనాభాకు అనుగుణంగా అవసరమైన పంటలను ప్రోత్సహిం చాల్సి ఉంది. పంటల దిగుబడులు పెంచి, విదేవ్శాల నుంచి దిగుమతులను తగ్గించుకోవడం కూడా ముఖ్యం. ముఖ్యంగా వ్యవసాయ పంటల దిగుమతతును పూర్తిగా తగ్గించుకుంటేనే మేలు. వ్యవసాయ దిగుబడులను తగ్గించి, ఎగుమతులను పెంచుకోవాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలన్న సూచనలు పెడచెవిన పెడుతున్నారు. నదుల అనుసంధానం జరగడం లేదు. పూర్తి విద్యుత్ ఉత్పత్తి దిశగా పెట్టబడులు రావడం లేదు. మన దేశం అభివృద్ధి సాధించాలంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలి. మోడీఅధికారంలోకి వచ్చిన కొత్తలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి, రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తానన్న మోడీ హామీ పదేళ్లయినా అమలు కావడం లేదు. దేశ జనాభాలో 60 శాతం మందికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా ఈ రంగాన్ని పైకి తీసుకుని రావడం, వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం జరగడం లేదు. పప్పుల ధరలు పెరుగుతున్నా, మనదేశంలో పప్పు పంటలను ప్రోత్సహించడం లేదు. నూనె ధరలు పెరుగుతున్నా, నూనెగింజల పంటలకు ప్రోత్సాహం దక్కడం లేదు. వేగంగా దిగజారిపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవలసి వుంది. కానీ అలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. పంటల పెట్టుబడి సహాయం పెంచకుండా, కనీస మద్దతు ధర, ఉచిత బీమా అమలు చేయకుండా వ్యవసాయ సంక్షోభాన్ని బిజెపి ప్రభుత్వం మరింత తీవ్రం చేస్తున్నది. ఆహార సబ్సిడీ తగ్గించడంతో పేదలకు అందుతున్న రేషన్ సరుకుల కోటా తగ్గిపోతుంది. ఆకలి కేకలు పెరుగుతాయి. ఉపాధి పనులను వ్యవసాయానికి అనుబంధించాలన్న డిమాండ్ పట్టించుకోవడం లేదు. దేశంలో వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే సామాన్యులకు తిండిగింజలు దొరకడం లేదు. అధిక ధరలతో సామాన్యులు ఉప్పులు, పప్పులు కొనుక్కోలేక పోతున్నారు. ఈ సమస్యలను పార్లమెంటు చర్చించదు. బయటా చర్చించం లేదు. దేశంలో నిరుద్యోగ తీవ్రత చాలా ఎక్కువగా వుంది. దేశంలో పని చేయగలిగిన శ్రామికుల సంఖ్య 64 శాతానికి పెరిగిందని, కేవలం 37 శాతం మందికి మాత్రమే పనులు దొరికాయని ఓ నివేదిక తెలిపింది. యువతకు ఉపాధి కల్పించడం దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్‌గా మారింది. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ ప్రభావంతో నిరుద్యోగం మరింత తీవ్రం కానుంది. ఐటి సేవల రంగాలలో తక్కువ నైపుణ్యం ఉంటే చాలన్న రీతిలో సాగుతోంది. ఐటి కంపెనీలు కూడా ఉద్యోగులను ఉన్న పళంగా తీసేస్తున్నాయి. ఈ క్రమంలో వ్యవసాయానుబంధ రంగాలను బలోపేతం చేయడం మినహా మరో గత్యంతరం లేదు. ప్రధాని మోడీ చెబుతున్నట్లుగా 2047 నాటికి దేశం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే విద్యారంగం, వ్యవసాయరంగం కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. ఆదాయం నుండి విద్య, వైద్యానికి చేసే ఖర్చులు పెరిగిపోయాయి. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.ఆర్థిక అంతరాలను తగ్గించడానికి సంపన్నుల మీద పన్నులు వేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. పేదరికం లేని సమాజం కోసం ప్రణాళికలు అమలు చేయడం లేదు. వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురి కావడంతో ఆహారభద్రత కూడా లేకుండా పోతున్నది.

# గిరిజన జాతరలో బంగారమే నైవేద్యం

- బెల్లంతో అమ్మవారికిమొక్కులు
- మేడారం జాతరలో ఇదే ప్రత్యేకత



వరంగల్,ఫిబ్రవరి13( వెలుతురు ):

మేడారం జాతరలో బెల్లాన్నే బంగారంగా పిలుస్తారు. సమ్మక్క సారలమ్మ గద్దెల నుంచి కనీసం చిటికెడు బెల్లాన్నైనా ప్రసాదంగా తెచ్చుకోవాలని భక్తులు పోటీ పడుతుంటారు. ఎక్కడైనా దేవుళ్లకు నైవేద్యంగా పండ్లు, పదార్థాలను పెడుతుంటారు. బంగారాన్ని నైవేద్యంగా స్వీకరించే ఏకైక జాతర మేడారం మాత్రమే. వీటితో పాటు సమ్మక్క సారలమ్మలకు చీర, గాజులు, పసుపు కుంకుమలు చెల్లించి చల్లగ చూడమని వేడుకుంటారు.పూర్వం గిరిజనులు మాత్రమే జరుపుకునే ఈ జాతరకు ఇప్పుడు కోట్లాదిగా భక్తులు వస్తున్నారు. అయితే, జాతరకు వెళ్లేదారిలో దప్పిక, నీరసం రాకుండా బలవర్ధకమైన బెల్లాన్ని తమ వెంట తీసుకువెళ్లేవారు. గిరిజనులు ఎంతో ఇష్టంగా తీసుకునే బెల్లాన్నే అమ్మవార్లకు కూడా నైవేద్యంగా సమర్పించేవారు. వారు భక్తి శ్రద్ధలతో సమర్పించే ఈ నైవేద్యమే ఆ వనదేవతలకు బంగారంతో సమానంగా భావిస్తారని విశ్వశిస్తారు. బెల్లానికి అడవి బిడ్డలు ఎంతో ప్రాధాన్యాన్నిస్తారు. అమ్మవార్లకు సమర్పించేది కాబట్టి దీనినే కాలక్రమేణా బంగారంగా పిలువడం మొదలైందని చెప్తారు. ÷ూకతీయుల కాలం నుంచే అమ్మవార్లకు ఇక్కడ బెల్లం సమర్పించడం జరుగుతుంది. పూర్వం చాలా దూరం నుంచి భక్తులు ప్రయాణించి ఎడ్ల బండ్ల మీదకెళ్లి వచ్చి అమ్మవార్ల దగ్గరికి చేరుకునేవారట. ఇక్కడే వారం లేదా పది రోజులు ఉండేవారట. ఆకలి వేసినప్పుడు త్వరగా శక్తిని అందించే బెల్లం పానకంతో తయారు చేసే ఆహారాన్ని తీసుకునేవారట. అందుకే అది అప్పటినుంచి చాలా విలువైనదిగా భావించి.. సమ్మక్క-సారలక్కకు సమర్పించడం ప్రారంభమైందని స్థానికులు చెబుతారు.రెండేళ్లకోమారు జాతర జరిగితే..ఏడాదికోమారు మినీ జాతర సాగుతుంది. అతిపెద్ద ఆదివాసీ జాతర మేడారం సమ్మక్క సారలమ్మ మినీ జాతర మళ్లీ మొదలైంది. వన దేవతల దర్శనం కోసం రాష్ట్రవ్యాప్తంగా భక్తులు మినీ మేడారం జాతరకు బయలుదేరి వెళ్తున్నారు. చల్లని తల్లులకు బంగారాన్ని గుట్టలుగా పోగుచేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. పూర్వం గిరిజనులు మాత్రమే జరుపుకునే ఈ పండుగకు ఇప్పుడు ఎన్నో రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారు. వచ్చిన వారంతా అమ్మవార్లకు బంగారాన్ని సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

# బీసీ రిజర్వేషన్ల పై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- యం.వి.రమణ రాష్ట్ర కన్వీనర్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ

హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 13:



స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ లకు రిజర్వేషన్ లు 42 శాతం ఇవ్వడానికి చట్టబద్ధత కల్పిస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ స్వాగతిస్తుంది. కుల గణన సర్వేలో పాల్గొనని వారికి ఈనెల 16 నుండి 28 వరకు మరో అవకాశం ఇచ్చినందున అందరూ వారి సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం. మార్చిలో జరగబోయే అసెంబ్లీ సమావేశంలో 42 శాతం ఇవ్వాలని తీర్మానం పెడతామని, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను ఢిల్లీ తీసుకు వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకు వస్తామని చెప్పిన మాటలు నిలబెట్టుకోవాలని కోరుతున్నాం. బీసీలకు విద్యా ఉద్యోగాలలో కల్పించిన విధంగా స్థానిక సంస్థలలో కూడా ఏబిసిడి వర్గీకరణ చేయాలని కోరుతున్నాం. సర్వే అయిన తర్వాత కులాల వారీగా పూర్తి వివరాలు మరియు ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితి పై సమగ్ర సమాచారం రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేస్తున్నాం.

# కిషన్ గౌడ్ దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు



వెలుతురు, అబ్దుల్లా పూర్ మెట్, ఫిబ్రవరి 13:
అబ్దుల్లాపూర్ మెట్ మండలం ఇనాంగూడ గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు అంతటి కిషన్ గౌడ్ ఇటీవల మరణించడంతో గురువారం నాడు ఆయన దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో హాజరై వారి కుటుంబ సభ్యులతో కలిసి కీర్తిశేషులు అంతటి కిషన్ గౌడ్ చిత్రపటానికి భువనగిరి మాజీ ఎంపీ బుర్రా నర్సయ్య గౌడ్,గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి లు వేర్వేరు గా నివాళ్లు అర్పించారు, ఈ కార్యక్రమంలో పలువురు గౌడ సంఘం నాయకులు, వివిధ పార్టీల నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల గ్రామంలో బడి-గుడి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే





వెలుతురు, రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 13:
రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామం లో గురువారం నాడు ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రభుత్వ మోడల్ స్కూల్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి అన్ని విధాలుగా కృషి చేస్తుందని తెలిపారు,అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను నియమించిందని రంగారెడ్డి అన్నారు, అలాగే విద్యార్థులకు మంచి ఆహారం అందించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు, అదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలను కేటాయించిందని తెలిపారు, అలాగే ఆరుట్ల గ్రామంలో గురువారం నాడు శ్రీ శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణ రతోత్సవ కార్యక్రమం లో ఇబ్రహీం పట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో భారీగా ప్రజలు, భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి కళ్యాణ రతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు,

# స్మార్ట్‌మీటర్లపై వివరణ ఇవ్వండి

- ఎస్పీడీసీఎల్ ఎండీకి మంత్రి గొట్టిపాటి ఆదేశాలు

అమరావతి,ఫిబ్రవరి13( వెలుతురు ):
నిబంధనలకు విరుద్ధంగా స్మార్ట్ మీటర్ల పరికరాల బిల్లులు చెల్లింపుపై ఎస్పీడీసీఎల్ ఎండీ సంతోష్‌రావును విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివరణ కోరారు. మీడియాలో వరుస కథనాలపై ముఖ్యమంత్రికి ఉన్న అసంతృప్తిని ఎండీకి వివరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా కాకుండా, ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో మంత్రిని ఎస్పీడీసీఎల్ ఎండీ కలిశారు. గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలు తగ్గాలని మంత్రి ఆదేశించారు. వేసవిలో విద్యుత్ కోతలు ఉండరాదన్నారు. కూటమి ప్రభుత్వం హామీ మేరకు రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ అందాలని ఆదేశించారు.

# తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసిన మాదిగ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి మరియు ప్రజాసంఘాల నేతలు

హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 13:
గురువారం ఉదయం 11 గంటలకు మాదిగ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి గారి ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల మాదిగ కుల సంఘ నాయకులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారిని కలిసి పలు అంశాలు పైన మాట్లాడడం జరిగింది మరియు మాదిగలకు 9%రిజర్వేషన్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు తెలుపడం జరిగింది.
మాదిగల పక్షపాతిగా నిలిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అని మాదిగ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు.

1. 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ పోరాటంలో మాదిగ ఉద్యమకారుల పైన ఉన్న కేసులను ఎత్తివేయాలి.
2. మాదిగ అమరవీరుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలి.
3. వర్గీకరణ ఉద్యమంలో పాల్గొన్న మాదిగ నాయకులను ఉద్యమకారులుగా గుర్తించాలి. వారికి 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలి.
4. ఇందిరమ్మ ఇల్లు మరియు డబుల్ బెడ్ రూమ్ లో మాదిగ ఉద్యమకారులకు అవకాశం కల్పించాలి.



ఈ కార్యక్రమంలో MHPS వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ గారు తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా సంఘాల నాయకులు పేరపోగు వెంకటేశ్వర్లు మాదిగ ఉసురుపాటి బ్రమ్మయ్య డా"మల్లేశం నంద్రు నరసింహా రావు చంద్రశేఖర్ ,బచ్చలకుర బాల్ రాజ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న కార్పోరేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి

- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు.
- జాజుల లింగంగౌడ్



హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 13:
పరీక్షల సమయంలో ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న కార్పొరేట్ స్కూల్స్ కళాశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కార్పొరేట్ టెక్నో,ఒలంపియాడ్ వంటి స్కూల్లో కాలేజీలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించడమే దీనంతటికి కారణమని అన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ స్కూల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుకుంటూ పోవడం వల్ల సామాన్య,మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫీజులు చెల్లించే విషయంలో కొద్దిగా జాప్యం జరిగిన విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఎక్కడపడితే అక్కడ అడిగి విద్యార్థులను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాయని అన్నారు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లుగా వివరించడం వల్లనే ఇదంతా జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన యువజన పరిషత్ స్టేట్ ప్రెసిడెంట్ బూర శ్రీనివాస్,మాల విద్యార్థి సంఘం స్టేట్ ప్రెసిడెంట్ చంద్ర మోహన్ రాయ్, ట్రైబల్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు శ్రీను నాయక్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు గోదా రవీంద్ర, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లోని కేఎల్ యూనివర్సిటీలో మాస్టర్ క్లాస్ సెమినార్ నిర్వహణ.



హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 13:
హైదరాబాద్ అజీజ్ నగర్ లోని KL విశ్వవిద్యాలయం లో గురువారం "మొదటి ప్రయత్నంలో సివిల్ సర్వీసెస్ సాధించడం ఎలా– UPSC మాస్టర్ క్లాస్" అనే అంశం పైన సెమినార్‌ను విజయవంతంగా నిర్వహించారు . హైదరాబాద్‌లోని 21st సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ శ్రీ పి. కృష్ణ ప్రదీప్ విద్యార్థులతో మాట్లాడుతూ.."మీరు సమాజం పట్ల అంకితభావం మరియు ఇష్టం తో పనిచేసినప్పుడుబీ ప్రకృతి కూడా మీ మంచి పనికి మద్దతు ఇస్తుందని, UPSCలో అర్హత సాధించడం ద్వారా సమాజానికి మంచి చేయడం సాధ్యమవుతుంది" అని ఆయన అన్నారు. తన వ్యక్తిగత నిధులు మరియు ప్రజా సహకారాలను ఉపయోగించి మణిపూర్‌లోని మారుమూల ప్రాంతంలో 100 కిలోమీటర్ల రహదారి నిర్మించిన "మిరాకిల్ మ్యాన్"గా ప్రసిద్ధి చెందిన శ్రీ ఆర్మ్‌స్ట్రాంగ్ పేమ్, ఐఏఎస్ యొక్క స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని ఉదాహరణగా చెబుతూ కృష్ణ ప్రదీప్ ప్రతి విద్యార్థి ఆయనలా ఆలోచించాలి అన్నారు. 21st సెంచరీ ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటర్ డాక్టర్ భవానీ శంకర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ డిగ్రీతో పాటు UPSC కోసం ఎలా ప్రిపేర్ కావాలి , దీని ఎలా బాలన్స్ చేసుకోవాలో విద్యార్థులకు చెప్పారు ఉన్నత విద్యాసంస్థల విద్యార్థులు మాత్రమే UPSCలో విజయం సాధిస్తారనే అపోహను ఆయన తోసిపుచ్చారు. క్రమశిక్షణా తో చదివితే ఎవరికైనా సివిల్స్ సాధించడం తేలిక అని అన్నారు . ఈ సదస్సు లో , 21st సెంచరీ అకాడమీ రచించిన పుస్తకాలను ఆవిష్కరించి విశ్వవిద్యాలయ లైబ్రరీలో అందుబాటులో



ఉంచారు. మూడవ సంవత్సరం విద్యార్థులు ప్రవళిక మరియు షహ్నా విద్యార్థులకు స్వాగతం పలికారు . స్టూడెంట్ ప్రోగ్రెషన్ అండ్ ట్రైనింగ్ అసోసియేట్ డీన్ డాక్టర్ బి. రవి, స్టూడెంట్ ప్రోగ్రెషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ & కోఆర్డినేటర్ డాక్టర్ సుభ్రాంగీనీ దాస్, వింగ్స్ మీడియా మరియు G-5 మీడియా నుండి శ్రీ గిరి ప్రకాష్ మరియు శ్రీ గణేష్ పాల్గొన్నారు.

# పోక్సో కేసు లో జీవిత ఖైదు శిక్ష

- కోపం తో జడ్జి పై కి చెప్పు విసిరిన ఖైదీ కరణ్ సింగ్




వెలుతురు, ఎల్ బి నగర్, ఫిబ్రవరి 13:
రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు తీర్పు పై ఆగ్రహం చెందిన ఓ వ్యక్తి జడ్జి పై చెప్పు విసిరిన సంఘటన గురువారం నాడు రంగారెడ్డి జిల్లా కోర్టు లో జరిగింది. దీంతో కోర్టు ఆవరణం లో ఒక సరిగా గందరగోళం ఏర్పడింది,పోక్సో కేసు లో కరణ్ సింగ్ అనే ముద్దాయి కి జడ్జి జీవిత ఖైదు శిక్ష విధించింది, దీంతో ముద్దాయి కరణ్ సింగ్ కోపానికి గురై కోర్టు లోనే జడ్జి పైకి చెప్పు విసరడంతో పోలీసులు అప్రమత్తమై ముద్దాయి ని అదుపులోకి తీసుకున్నారు, ఈ సంఘటన పై రంగారెడ్డి జిల్లా బార్ కౌన్సిల్ , న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు,అలాగే ఈ సంఘటన నేపథ్యంలో శుక్ర వారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో నిరసనలను వ్యక్తం చేయాలని పిలుపు ఇచ్చారు, అలాగే ముద్దాయి కరణ్ సింగ్ గతంలో కూడా పోలీసులపై దాడి చేశారని ఆరోపించారు, కాగా కరణ్ సింగ్ గతంలో జగద్గిరి గుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రేప్ కేసు లో విచారణ జరిపి నిందితుడికి జడ్జి జీవిత ఖైదు శిక్ష విధించారు, ఇది నచ్చని ముద్దాయి కరణ్ సింగ్ జడ్జి పైకి చెప్పు ను విసరడంతో కోర్టు లో గందరగోళం ఏర్పడింది,

# హయత్ నగర్ ఆర్టీసీ డిపోల వద్ద కార్మికుల నిరసన కార్యక్రమం




వెలుతురు, హయత్ నగర్, ఫిబ్రవరి 13:
రాష్ట్ర ప్రభుత్వం వెంటనే టీజీ ఆర్టీసీ ని ప్రభుత్వం లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ గురు వారం నాడు హయత్ నగర్ ఆర్టీసీ 1.2 డిపో ల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు, అలాగే ఆర్టీసీ లో ప్రవేశ పెడుతున్న ఎయిర్ బస్సు లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఆర్టీసీ ని ప్రైవేట్ చేయాలన్న ఆలోచన ఉంది కాబట్టే తాము జనవరి 27 న సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు, అయితే ప్రభుత్వం స్పందించక పోతే సమ్మె తప్పదని హెచ్చరించారు, ఈ నిరసన కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు థామస్ రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, యాదయ్య, సతీష్, సంజీవ్, ఆనంద్, రాజేష్, గ్యార బాల్ నర్సింహ, చంద్రయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు,

# మనస్తాపం తో యువకుడి మృతి



వెలుతురు, హయత్ నగర్, ఫిబ్రవరి 13:
తనకు రావాల్సిన డబ్బుల విషయంలో గొడవ పడి తీవ్ర మనస్తాపానికి గురైన డబ్బులు రానీ కారణంగా ఇంట్లో ఉరి పోసుకొని మృతి చెందిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మా రెడ్డి పాలెం లో చోటుచేసుకుంది, పోలీసుల కథనం ప్రకారం 16 సంవత్సరాల వయస్సు ఉన్న ఆనంద్ క్యాటరింగ్ పనులు చేస్తున్నాడు, ఈ క్రమంలో అతను చేసిన పనికి డబ్బులు రావాల్సిన వ్యక్తి తో గొడవ పడి తనకు డబ్బులు ఇవ్వలేదని మనస్థాపం చెంది ఆత్మ హత్య చేసుకొనడానికి ఆనంద్ తల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు, అయితే ఈ కేసులో పోలీసులు తనకు న్యాయం చేయాలని ఆనంద్ తల్లి కోరారు, దీంతో ఆమె కు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు,



## పెన్షన్ ఇప్పించండి మహాప్రభూ అనే వెలుతురు వార్త కథనానికి స్పందన

సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు ఫిబ్రవరి 13: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచన మేరకు జై చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ దోనూరు జైపాల్ రెడ్డి ( చిమిర్యాల మాజీ సర్పంచ్ ) కొలను యాదిరెడ్డి కుటుంబానికి 25000/- ఆర్థిక సహాయం అందచేయడం జరిగింది.ప్రమాదంలో కాలు కోల్పోయిన సాయిగొని బాయి, పుట్టపాక గ్రామానికి చెందిన కొలను యాదిరెడ్డి అంగ వైకల్యం తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని తెలిసి మానవత ధృప్పదం తో సహాయం చేయడం జరిగింది . అలాగే పెన్షన్ నీ కూడా త్వరలో వచ్చేటట్టు చేస్తానని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రామస్వామి, శివానందరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుల నాయకుడు మన్నే నరసింహారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతిని విజయవంతం చేయండి...

- (LHPS)లంబాడి హక్కుల పోరాట సమితి.....
- ఫిబ్రవరి 15వ తేదీ ఉదయం 9 గంటలకు మహావీర్ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి...



**సూర్యాపేట వెలుతురు ఫిబ్రవరి 13:** శ్రీ సేవాలాల్ మహారాజ్ భవన్ (హైదరాబాద్ ) బంజారా హిల్స్ నందు రాష్ట్ర ప్రభుత్వం తరపున గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ట్రైకార్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డా.బెల్లయ్య నాయక్ తేజావత్ గారి అధ్యక్షతన ఈ కార్యక్రమము జరుగుచున్నది. ఈ బోగ్ బండారు సేవాలాల్ మాహరాజ్ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులు రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు. మరియు రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు. ఎంపీ లు హాజరవుతున్నారు అని. లంబాడి హక్కుల పోరాట సమితి సూర్య పేట జిల్లా కన్వీనర్ భూక్యా రాజు నాయక్ అన్నారు... కావున రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి బంజారా ఉద్యోగస్తులు. లంబాడి ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయగలరు అని అన్నారు... ఈ కార్యక్రమంలో. రాష్ట్ర ఉపాధ్యక్షుడుధరావత్ మంగత నాయక్. వెంకటేష్ నాయక్ భూక్యా అశోక్ నాయక్. భూక్యా సురేష్ నాయక్ భవిక్ నాయక్ హర్దిక్ నాయక్. రిషి నాయక్ ఐయన్ నాయక్. మధు నరేష్ సంఘ నాయకులు పాల్గొన్నారు...

## కోటయ్య ను పరామర్శించిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, గాదరి కిషోర్





**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 13:** బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్ తండ్రి మారిపెద్ది కోటయ్య ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో తలకి గాయం కావడంతో సూర్యాపేట పట్టణంలోని కమల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసి వారిని పరామర్శించిన మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ లు,ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్ లు వీరితో పాటుగా బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే నల్లగొండ జిల్లాహలియా పట్టణంలోని వజ్రతేజ రైస్ క్లస్టర్ లో ప్రముఖ వ్యాపారవేత్త చిట్టిపోలు యాదగిరి కుమారుడు హేమంత్ - అనూహ్య వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి,ఎమ్మెల్సీ ఎంసి.కోటిరెడ్డి ,మాజీ ఎమ్మెల్యేలు డా.గాదరి కిశోర్ కుమార్ ,ఎన్. భాస్కర్ రావు ,కంచర్ల భూపాల్ రెడ్డి ,నోముల భగత్ ,రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహ రెడ్డి ,మాజీ గ్రంథాలయ ఛైర్మెన్ రేగట్టే మల్లిఖార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

## ఉపాధి హామీ పని చేస్తూ మరణించిన లింగాల శ్యామల కుటుంబానికి ప్రభుత్వం ఎక్సగ్రేషియా చెల్లించి ఆదుకోవాలి



- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 13**

ఉపాధి హామీ పనిలో మరణించిన శ్యామల లింగమ్మను ప్రభుత్వం ఆదుకొని ఎక్స్రేషియా చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామన్నపేట పట్టణానికి చెందిన ఉపాధి హామీ కూలి శ్యామల లింగమ్మ గురువారం ఉపాధి హామీ పనికి వెళ్లి వడదెబ్బ కొట్టి మరణించగా వ్యవసాయ కార్మిక సంఘం,సిపిఎం ఆధ్వర్యంలో వారి ఇంటికెళ్లి పూలమాల వేసి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీకి వెళ్లి వడదెబ్బతో మరణించిన శ్యామల లింగమ్మను ప్రభుత్వం ఎక్స్రేషియా అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో కనీసం మంచినీటి సౌకర్యం లేకుండా,టెంటు నీడ సౌకర్యం లేకుండా పనులు నిర్వహిస్తున్నారని దీని మూలంగా ఉపాధి కూలీలు మరణిస్తున్నారని దీనిపై ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోవాలని అన్నారు.నిత్యం కూలీ పని మీద ఆధారపడి జీవించే పేద కుటుంబానికి చెందిన శ్యామల లింగమ్మను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిన ఆనంద్,కందుల హనుమంతు,పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, మండల కమిటీ సభ్యులు గొరిగె సోములు, నాయకులు బావండ్లపల్లి సత్యం, గంటెపాక శివ కుమార్, బర్ల బాబురావు, గుండాల బిక్షం, మెట్టు శ్రవణ్, తరీగొప్పుల వెంకటరెడ్డి, కుందూరు వెంకటేష్, బకీరు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద ఆర్యవైశ్య పిల్లలకు ఉచిత వైద్య సేవలు అందించనున్న కార్తీక పిల్లల హాస్పిటల్...

- డాక్టర్ నీరుమల్ల అరవింద్ ను కలిసి ధన్యవాదాలు తెలియజేసిన ఆర్యవైశ్య ప్రతినిధులు....

**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 13:**



కరీంనగర్ పట్టణం లోని కార్తిక పిల్లల హాస్పిటల్ డాక్టర్ నీరుమల్ల అరవింద్ తండ్రి లేని , నిరుపేద వైశ్య పిల్లలకు 12 సంవత్సరాల వరకు ఉచితంగా ఓపి కన్సల్టేషన్ , పరిమితమైన మందులు ఉచితంగా అందించనున్నారు. సహృదయంతో నిరుపేద ఆర్యవైశ్య పిల్లలకు కోసం వైద్యులు అరవింద్ ముందుకు రావడం గొప్ప విషయం, సంతోషకరమని ఆర్యవైశ్య నేతలు అన్నారు. ఈ మేరకు వైద్యులు అరవింద్ ను కృతజ్ఞతలు తెలియజేశారు .. ఇట్టి కార్యక్ర మంలో వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షులు జిల్లా జగదీష్ పట్టణ ఆర్యవై శ్య సంఘం కోశాధికారి వాసవి కపుల్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సుద్దా ల వెంకటేష్ , ఆర్సి పాత రాధా కిషన్ ,వేణుగోపాల్ పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలు రావికంటి భాగ్యలక్ష్మి , పట్టణ ఆర్యవైశ్య సంఘం అదనపు ప్రధాన కార్యదర్శి కొంజర్ల శ్రీకాంత్ ఉన్నారు.

## ఎం.ఎల్.సి. పోలింగ్ లో అర్హత గల ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 13**

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎం.ఎల్.సి. ఎన్నికలలో భాగంగా ఈ నెల 27వ తేదీన జిల్లాలో జరుగనున్న పోలింగ్ లో రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థలు, వ్యాపారం, పరిశ్రమలు, ట్రేడ్ ఇతర సంస్థలలో పని చేస్తున్న అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గం॥ల నుండి సాయంత్రం 4 గం॥ల వరకు పోలింగ్ జరుగుతుందని, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజు సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని, ప్రైవేట్ సంస్థలలో పని చేసే ఉద్యోగులు, అధికారులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా విధులలో వెసలుబాటు కల్పించడం జరుగుతుందని / సెలవు దినం ఇవ్వడం జరుగుతుందని, ఆయా సంస్థల యాజమాన్యాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సహకరించాలని తెలిపారు.



## కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

- నోముల స్వామి కుటుంబానికి పదివేల ఆర్థిక సహాయం అందించిన గంగుల వెంకట రాజిరెడ్డి
- సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు , కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 13**

మండలం నీర్నెముల గ్రామానికి చెందిన నోముల స్వామి అనారోగ్యంతో మరణించినారు. విషయం తెలుసుకున్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సర్పంచ్ ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు గంగుల వెంకట రాజిరెడ్డి పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని తెలుపుతూ, స్వామి కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించినారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి అక్రమ్, చల్ల సత్య ప్రకాష్, నోముల మల్లేష్, యువజన నాయకులు నోముల ప్రవీణ్, నోముల విష్ణు, చిప్పలపల్లి స్వామి, చిప్పలపల్లి రామచంద్రం గ్రామ ముఖ్య నాయకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత మంచినీటిని ప్రజలందరూ ఉపయోగించుకోవాలి

- సువెన్ కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు

**వెలుతురు న్యూస్ సూర్యాపేట ఫిబ్రవరి 13**



సువెన్ ఫార్మసుటికల్స్ వారి సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా వస్త్రం తండా ఆరో వార్డులో నిర్మించిన సురక్షిత మంచినీటి ప్లాంట్ ను ప్రజలు ఉపయోగించుకోవాలని సువెన్ కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు అన్నారు. గురువారం 12 కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించిన సురక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి స్థలం వితరణ చేసిన మాజీ కౌన్సిలర్ ధరావత్ నీలాబాయి కుటుంబ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ సంస్థ ద్వారా ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో ప్రజలందరు సురక్షిత మంచినీటిని సద్వినియోగం చేసుకొని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల భాగస్వామ్యంతో సువెన్ పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం పలు రకాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఇందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు హెచ్ ఆర్ అడ్మినిస్ట్రేషన్ సీనియర్ మేనేజర్ బి. వెంకటరమణ, డిప్యూటీ మేనేజర్ డి సైదులు, ఫెసిలిటీ మేనేజర్ జీవన్ నాయక్, బానోతు కృష్ణ, వస్త్రం తండా అసోసియేషన్ పెద్దలు, మాజీ కౌన్సిలర్ నీలాబాయి లింగా నాయక్, సైదా నాయక్, మాజీ ఎంపీటీసీ శంకర్ నాయక్, ధారావత్ శివరాం నాయక్, సేవియా నాయక్, ఆలియా నాయక్, వార్డు ప్రజలు, సువెన్ సిబ్బంది సైదులు, పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీ పనికి పోయి గుండెపోటుతో మృతి చెందిన శ్యామల లింగమ్మ

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 13**



మండల కేంద్రానికి చెందిన శ్యామల లింగమ్మ వయస్సు 55 సంవత్సరాలు భర్త బుచ్చయ్య ఉపాధి హామీ పనుల నిమిత్తం నర్సరీలో, పనిచేయడానికి ఈరోజు వెళ్లగా మధ్యాహ్నం 1.30 నిమిషాలకు భోజన విరామ సమయంలో, అనుకోకుండా గుండెపోటు రావడంతో, 108 వాహనం లో రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లుగా ఆసుపత్రి సిబ్బంది తెలపడం జరిగినది. రోజు తమతో కలిసి ఉండే లింగమ్మ మృతి చెందడం కాలనీవాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ చెరుకు సత్యనారాయణ పై అధికారులకు విషయం తెలియజేయడం జరిగినది.ఏపీవో పున్న వెంకన్న తక్షణమే పై అధికారుల దృష్టికి విషయం తీసుకువెళ్లినారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (టి ఏ) తక్షణమే స్పందించి ఫీల్డ్ ఆఫీసర్ రాగ్య నాయకున్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి ఉపాధి పనిచేస్తూ కూలి మరణిస్తే,వారికి రావలసిన రెండు లక్షల ఎక్స్రేషియా ప్రభుత్వం నుండి ఇప్పిస్తానని వివరణ ఇచ్చినారు.ద

## ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు రాజు ను పరామర్శించిన కవిత

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 13:**



జనగామ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు చిన్నబోయిన రేఖరాజు ను గురువారం నాడు ఆయన నివాసానికి వెళ్లి జాగృతి సంస్థ అధ్యక్షురాలు. ఎంఎల్సీ కవిత పరామర్శించారు ,చిన్నబోయిన రాజు మూడురోజుల క్రితం రోడ్డు ప్రమాదం లో గాయపడగా ఆయన ను కవిత కలిసి పరామర్శించారు, ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ , సమస్థాన్ నారాయణ పూర్ మాజీ జెడ్ పి టి సి బొల్ల శివ తదితరులు బీఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు,

## గోండిధర్మ గురువు హీరాసుక జయంతి వేడుకలను జయప్రదం చేయాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్ వెలుతురు ఫిబ్రవరి 13:**
గురువారం ఎమ్మెల్యే ను పట్టణంలో ఆయన వాసంలో హీరాసుక జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హీరాసుక జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించే జయంతి ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కమిటీ సభ్యులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రికను అందించారు. పట్టణంలో హీరాసుక విగ్రహం ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## పరీక్షల సన్నద్ధతపై ఎమ్మెల్యే పరిశీలన

- ఆకస్మికంగా వసతిగృహం తనిఖీ



**ఆదిలాబాద్ వెలుతురు ఫిబ్రవరి 13:**
పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థుల సన్నద్ధత ను ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరిశీలించారు ఆదిలాబాద్ పట్టణంలోని బీసీ వసతి గృహాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు పదో తరగతి ప్రిపరేషన్ లో సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు వసతి గృహంలో భోజనం ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

## ఫాస్టాగ్‌లో కొత్త నిబంధనలు అమలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి13( వెలుతురు):**
టోల్ రహదారులపై టోల్ వసూలు కోసం ఉద్దేశించిన ఫాస్టాగ్ లావాదేవీలకు సంబంధించి నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ముఖ్యంగా బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఫాస్టాగ్ వినియోగదారులకు కొత్తగా '70 నిమిషాల' వ్యవధిని నిర్దేశించింది. నిర్దేశిత సమయంలో బ్లాక్‌లిస్ట్‌లోంచి వైదొలగడంలో విఫలమైతే డబుల్ ఫీజు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు ఫిబ్రవరి 17 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు జనవరి 28నే ఓ సర్క్యులర్ జారీ చేసింది. ఫాస్టాగ్‌లో తగిన బ్యాలెన్స్ లేకపోతే ఆ ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్‌లోకి వెళుతుంది. టోల్‌ప్లాజా రీడర్ వద్దకు చేరుకునే సమయానికి 60 నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాస్టాగ్ ఇన్‌యాక్టివ్‌లో ఉంటే కోడ్ 176 ఎర్రర్‌ను చూపి లావాదేవీని తిరస్కరిస్తారు. అలాగే, స్కాన్ చేసిన 10 నిమిషాల తర్వాత ఇన్‌యాక్టివ్‌లోకి వెళ్లినా ఇదే కారణంతో లావాదేవీని తిరస్కరిస్తారు. ఇలాంటి సందర్భంలో పెనాల్టీ కింద రెట్టింపు టోల్ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క బ్యాలెన్స్ మాత్రమే కాదు.. కేవైసీ వెరిఫికేషన్ పూర్తి చేయకపోవడం, ఛాసిస్ నంబర్‌కు, వెహికల్ నంబర్‌కు మధ్య పొంతన లేకపోవడం వంటి కారణాలతో ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్‌లోకి వెళుతుంది. ఈ నిబంధన గురించి వాహనదారులు తెలుసుకోవడం ముఖ్యం. ఫాస్టాగ్‌ను చివరి నిమిషంలో రీఛార్జి చేసే అలవాటు ఉన్న వారు దీన్ని దృష్టిలో పెట్టుకుని ముందుగానే రీఛార్జి చేసుకోవడం మంచిది.

# భారతదేశ ఉపాధి రంగంలో గణనీయమైన పరివర్తన చోటు చేసుకుంటుంది..

- మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్ నుండి వికసిత్ భారత్ వైపు...
- స్వదేశీ భావనను ప్రచారం చేయడంలో స్వదేశీ జాగరణ్ మంచ్ కృషి ప్రశంసనీయం...





**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 13:**
దేశ ఉపాధి రంగంలో గణనీయమైన పరివర్తన చోటు చేసుకుంటుందని, భారత ప్రభుత్వం చేపట్టిన మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్స్ పథకాల ద్వారా ఉపాధి రేటు గణనీయంగా పెరిగిందని ,



దేశాన్ని , పౌరులను అన్ని విధాలుగా స్వతంత్రంగా, స్వావలంబనగా మార్చడమే లక్ష్యంగా నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ దిశలో స్వదేశీ జాగరణ్ మంచ్ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రజ్ఞాభారతి రాష్ట్ర ఉపాధ్యక్షులు, సమాలోచన రాష్ట్ర కన్వీనర్, ప్రజ్ఞా ప్రవాహ కేంద్రీయ కార్య సమితి సభ్యులు మామిడి గిరిధర్ అన్నారు. స్వదేశీ మేళా ప్రోగ్రాం లో భాగంగా గురువారం రోజున కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో డిగ్రీ, పీజీ విద్యార్థుల కు స్వదేశీ, గ్లోబలైజేషన్ అంశాలపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చడానికి ప్రారంభించిన మేకిన్ ఇండియా లాంటి కార్యక్రమం స్వావలంబి వైపు భారత్ ను ముందుకు తీసుకెళ్లడంలో, వికసిత్ భారత్ యొక్క దృక్పథాన్ని నెరవేర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మూడు దశాబ్దాలుగా స్వదేశీ భావనను ప్రచారం చేయడంలో స్వదేశీ జాగరణ మంచ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. మార్కెటింగ్ ప్రొఫెషనల్, మీడియా స్ట్రాటజిస్ట్ సురేష్ కొచ్చిటిల్, నేషనల్ లిస్ట్ హబ్ సీఈవో అవునూరి సాయి కృష్ణ లు మాట్లాడుతూ పెట్టుబడి , ఆవిష్కరణ, వ్యవస్థాపకతకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం ద్వారా దేశీయ తయారీని రంగాన్ని గణనీయంగా పెంచుకోవచ్చన్నారు . ఆ దిశగా నేటి ప్రభుత్వం ముఖ్యమైన కీలక రంగాలపై దృష్టి సారించిందని, తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, ఉపాధిని సృష్టించడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం లాంటి విధానాలతో ముందుకు కొనసాగుతూ , భారతదేశం యొక్క ప్రపంచ పోటీ తత్వాన్ని పెంచడం లక్ష్యంగా ప్రయాణాన్ని కొనసాగిస్తుందన్నారు. స్వయం సమృద్ధి, దిగుమతుల తగ్గింపు, దేశీయ ఉత్పత్తి వృద్ధికి ప్రాధాన్యమిస్తూ ఆత్మనిర్భర్ భారత్ అవకాశాల అంతరంగాన్ని సృష్టిస్తుందన్నారు. కరీంనగర్ డైరీ చైర్మన్, స్వదేశీ మేళా కన్వీనర్ చెల్మెడ రాజేశ్వరరావు మాట్లాడుతూ స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళా స్థానిక పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో , చేతితో తయారుచేసిన అద్భుతమైన వస్తువులు మొదలుకొని, తాజా సాంకేతిక ఆవిష్కరణల వరకు. విస్తృతమైన స్వదేశీ ఉత్పత్తులను మేళాలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. సెమినార్ సభాధ్యక్షులు , రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జిల్లా సంఘచాలక్ సి. ఎ. నిరంజనాచారి, వి హెచ్ పి ప్రాంత టోలి సభ్యులు ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి మాట్లాడారు. మధ్యాహ్నం జరిగిన మెడికల్, ఫార్మసి, నర్సింగ్ విద్యార్థుల సెమినార్ కార్యక్రమానికి అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు మామిడి గిరిధర్ హాజరై మాట్లాడారు. భారతదేశ వైద్యవృత్తి గొప్పదనాన్ని వివరించారు. అనుసరించాల్సిన విధానాలను, సూచనలను విద్యార్థులకు తెలియజేశారు. సాయంత్రం వేళ ప్రోగ్రాంలో భాగంగా ప్రముఖ వైద్యులచే సాంప్రదాయ వస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ మానస ఆధ్వర్యంలో చేపట్టారు.

# కొల్లం కులదేవతలకు వైభవంగా పూజలు

- ఆరు రోజులు నియమ నిష్టలతో ప్రత్యేక పూజలు







**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 13**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బట్వాన్పల్లి లో కొల్లం కులస్తుల మదన పోచమ్మ, లక్ష్మీ , భీమన్న దేవతలకు ఆరు రోజులు ఘనంగా పూజలు నిర్వహిస్తారు. లక్ష్మీ అమ్మవారిని ప్రత్యేకంగా పూజిస్తారు. భీమన్న దేవుని శనివారం 30 కిలోమీటర్లు ఉన్న గంగానదికి తీసుకువెళ్లి గంగానదిలో వదిలేస్తారు. అయితే భీమన్న దేవుడు ప్రవాహానికి ఎదురు ఎక్కి అక్కడ కొంతమంది కులస్తులు వదులు పట్టుకొని ఎదురుచూస్తారు భీమన్న దేవుడు నీటి ప్రవాహానికి ఎదురు ఎక్కి ఒకరి ఒడిలో పడుతుంది అక్కడ నుండి కాలినడకన మళ్లీ స్వగ్రామమైన బట్వాన్పల్లికి ఆదివారం ఉదయం చేరుకుంటారు. ఊర్లోని కో లు భీమన్న, లక్ష్మి, మదన పోచమ్మ దేవతలకు జంతు బలి సమర్పించి గుడి దగ్గరే సహపంక్తి భోజనాలు నిర్వహిస్తారు. ఈ మహా జాతరలో కుల పెద్దలు గొలిశెట్టి ముతేష్, బోగారపు భీమేష్, రత్నమ్మ, గొలిశెట్టి మొగిలి, గొలిశెట్టి రాజయ్య, ఈగం రాజేష్, నాయిని శ్రీనివాస్ తదితర కోలం కులస్తులు సంబరాలు నిర్వహిస్తారు.

# దక్షిణ భారత టిబెటియన్ బౌద్ధ మత కేంద్రంలో బండి సంజయ్ పర్యటన

- రెండ్రోజుల పర్యటనలో భాగంగా మైసూర్ లోని బైలకుప్పేకు విచ్చేసిన కేంద్ర మంత్రి
- గోల్డెన్ టెంపుల్ సహా పలు చారిత్రక ప్రదేశాలను సందర్శించిన బండి సంజయ్
- కేంద్ర మంత్రికి సమస్యలను వివరించిన టిబెటియన్ శరణార్థులు
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి
- ఈరోజు (శుక్రవారం) ఉదయం 14వ దలైలామాతో భేటీ కానున్న బండి సంజయ్







మైసూర్ జిల్లా వెలుతురు ఫిబ్రవరి 13:
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రెండ్రోజుల పర్యటనలో భాగంగా కర్నాటకలోని మైసూర్ జిల్లాలోని టిబెటియన్ శరణార్థుల పునరావాస కేంద్రమైన బైలకుప్పేకు విచ్చేశారు. 1950లో టిబెట్ ను చైనా ఆక్రమించిన సమయంలో వేలాది మంది టిబెటియన్ శరణార్థుల ఇండియాకు తరలివచ్చారు. వీరందరికీ కేంద్ర ప్రభుత్వం కర్నాటకలోని మైసూర్ జిల్లా బైలకుప్పే ప్రాంతంలో పునరావాసం కల్పించింది. వీరికి నివాసాలను ఏర్పాటు చేయడంతోపాటు వ్యవసాయం చేసేందుకు అనువుగా 15 వేల ఎకరాలకుపైగా అటవీ స్థలాన్ని కేటాయించింది. దక్షిణ భారతదేశంలోని టిబెటియన్ బౌద్ధ మత కేంద్రం ప్రస్తుతం బైలకుప్పేలో ఉంది. ఈ ప్రాంతంలో 15 వేల మందికిపైగా టిబెటియన్ శరణార్థులు ఇక్కడ నివసిస్తున్నారు. టిబెటియన్ బౌద్ధ సంప్రదాయాలకు అనుగుణంగా అనేక మఠాలు, మత పాఠశాలలు, దేవాలయాలను నిర్మించుకున్నారు. ఈ నేపథ్యంలో టిబెటియన్ శరణార్థుల స్థితిగతులు, సమస్యలను తెలుసుకునేందుకు బైలకుప్పేకు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కు బౌద్ధ మత గురువు 14వ దలైలామా ప్రతినిధి జుగ్మే జిగ్నే, మైసూర్ కాలనీల ప్రధాన ప్రతినిధి జూనియర్ జుగ్మే సుల్ట్రాన్, జిల్లా మైనారిటీ అధికారి శిల్ప, స్థానిక అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బైలకుప్పేలోని ఎఫ్ టీసీఐ గెస్ట్ హౌజ్ నుండి స్థానిక గోల్డెన్ టెంపుల్ ను దర్శించారు. గోల్డెన్ టెంపుల్ విశేషాలను బౌద్ధ మత గురువుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అందులో భాగంగా పద్మ సంభవ, బుద్ధ, అమితాయుస్ ల ఎత్తయిన (40 అడుగుల) భవ్య విగ్రహాలను దర్శించుకున్నారు. గోల్డెన్ టెంపుల్‌తో పాటు పెనూర్ రింపూచె సమాధి, సెరా లాచె ఫిలాసఫీ యూనివర్శిటీ టెంపుల్, ఆర్గానిక్ రీసెర్చ్ ట్రైనింగ్ సెంటర్, ఓల్డేజ్ హోం లను సందర్శించారు.
అనంతరం దలైలామా ప్రతినిధి జుగ్మేతోపాటు స్థానిక అధికారులు, బౌద్ధ మతగురువులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 1950లో టిబెట్ నుండి ఇండియాకు వలస వచ్చిన వారిలో చాలా మందికి ఆధార్ కార్డులు లేవని తమ ప్రాంతంలో ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్డు విస్తరణలో భాగంగా చాలా మేరకు స్థలాన్ని కోల్పోతున్నామని, తగిన పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కన్నడ రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయంసహా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, బైలకుప్పేలో సాగు చేసుకుంటున్న టిబెటియన్ రైతులకు సైతం వాటిని వర్తింపజేయాలని కోరారు. ఏనుగుల బెడద తీవ్రంగా ఉందని, వీటి దాడిలో మరణిస్తే సాయం అందడం లేదన్నారు. తాము విదేశాలకు వెళ్లేందుకు, తమ బంధువులు ఇక్కడికి వచ్చేందుకు వీసాల మంజూరు విషయంలో ఇండియన్లతో పోలిస్తే అనేక ఆంక్షలు విధిస్తున్నారని, ఇవి తమకు ఇబ్బందిగా మారిందన్నారు. వారి సమస్యలను సానుకూలంగా విన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ త్వరలోనే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మరోవైపు శుక్రవారం ఉదయం బండి సంజయ్ 14వ బౌద్ధ మతగురువు దలైలామాతో భేటీ కానున్నారు.





## బీసీ జాబితాలో ముస్లింలను చేర్చిస్తే
# ఆమోదించే ప్రసక్తే లేదు



- మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం
- ఈ విషయం తెలిసి కూడా కేంద్రంపై నెట్టాలనుకోవడం మూర?త్వం
- బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ కు లేదని తేటతెల్లమైంది
- బీసీల్లో ముస్లింలను చేర్చడంవల్ల బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లు దక్కకుండా పోతాయి
- కాంగ్రెస్ పార్టీ బీసీలకు మరింత అన్యాయం చేస్తోంది
- ముస్లింలను బీసీల్లో కలిపితే హిందూ సమాజమంతా తిరగబడటం ఖాయం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పడం తథ్యం
- కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే బీసీ జాబితాలో నుండి ముస్లింలను తొలగించాల్సిందే
- ఎన్నికల హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందే
- ఇచ్చిన మాట తప్పుతూ బీసీలను నిండా ముంచుతున్న పార్టీ కాంగ్రెస్సే
- బీసీలంతా కాంగ్రెస్ మోసాలను గుర్తించాలని కోరుతున్నా
- స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే దమ్ము కాంగ్రెస్ కు లేదు
- మార్చిలోపు స్థానిక ఎన్నికలు నిర్వహించకపోతే తెలంగాణకు నష్టమని తెలీదా?
- 15వ గ్రాంట్స్ కమిషన్ నిధులు ఆగిపోతాయని తెలిసి కూడా జాప్యం చేస్తారా
- ఇప్పటికే రెండు దఫాలుగా నిధులు రాలేదు...
- 73, 74వ రాజ్యాంగ సవరణలను ఉల్లంఘిస్తున్నారు
- స్థానిక సంస్థలకు ఐదేళ్లకోసారి తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగం చెబుతోంది
- మీరు ఆమోదించిన రాజ్యాంగాన్ని మీరే అవమానిస్తారా?
- రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరగడం కాదు.... రాజ్యాంగాన్ని అమలయ్యేలా చూడాలి
- సర్పంచ్ లేకుంటే గ్రామ సభలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు జరిగేదెలా?
- గ్రామాల్లో పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నా పట్టించుకోరా?
- ఓడిపోతామనే భయానికే స్థానిక ఎన్నికలు నిర్వహించడం లేదు....
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 12:

## తోల్కట్ట జూదం కేసుతో సంబంధం లేదు

- ఆ ఫామ్‌హౌజ్ నా ఆధీనంలో లేదు
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్,ఫిబ్రవరి13( వెలుతురు ):**

నగరశివారులోని మొయినాబాద్ మండలం తొల్కట్టలో జరిగిన ఘటనతో తనకు సంబంధం లేదని భారాస ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పోలీసుల నోటీసులకు పూర్తి వివరణ ఇస్తానని, విచారణకు సహకరిస్తానని చెప్పారు. జరిగిన ఘటన, పోలీసుల నోటీసుల నేపథ్యంలో ఆయన ప్రకటన జారీ చేశారు. 2018లో కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన అన్ని వ్యవహారాలను తన మేనల్లుడు జ్ఞాన్‌దేవ్ రెడ్డి చూసుకుంటున్నారు. అక్కడ ఫామ్ హౌస్, గెస్ట్ హౌస్ లేవు. కేవలం మామిడి, కొబ్బరి తోట, పనివారి కోసం రెండు గదులు మాత్రమే ఉన్నాయి. నా ప్రమేయం లేకుండానే తోటను వర్రా రమేష్ కుమార్ రెడ్డి అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చినట్లు నిన్నటి ఘటన తర్వాత జ్ఞాన్‌దేవ్ రెడ్డి నుంచి తెలిసింది. వర్రా రమేష్ కుమార్ రెడ్డి కూడా ఆ తోటను ఎం.వెంకటపతి రాజుకు కౌలుకు ఇచ్చారని.. నిన్నటి వరకు నా దృష్టికి రాలేదు. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని నిన్ననే పోలీసులకు ఫిర్యాదు చేశానని అన్నారు. మీడియాలో వస్తున్నట్లు ఆ తోటలో ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగి ఉంటే వాటికి, నాకు ఎలాంటి సంబంధం లేదు. ఘటన జరిగిన రోజు నేను హైదరాబాద్‌లో లేను. వరంగల్‌లో ఎల్లమ్మ పండుగ కార్యక్రమంలో ఉన్నా. కేవలం రాజకీయంగా నన్ను ఇబ్బంది పెట్టడానికే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక్క చిన్న కేసు కూడా లేకుండా ప్రజా సేవకే అంకితమయ్యా. చట్ట వ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోను. భూమి యజమానిగా పోలీసులు నాకు నోటీసు ఇచ్చారు.. దానికి పూర్తి వివరణ ఇస్తా. సామాజిక మాధ్యమాల్లో నాపై దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తులకు లీగల్ నోటీసులు పంపిస్తా' అని ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తొల్కట్ట ఫామ్‌హౌస్‌లో మంగళవారం పొద్దుపోయాక పోలీసులు నిర్వహించిన దాడుల్లో మొత్తం 61 మంది చిక్కిన విషయం తెలిసిందే. వారి వద్ద రూ.30 లక్షల నగదు, జూదక్రీడలో ఉపయోగించే రూ.కోటి విలువైన బెట్టింగ్ కాయిన్లు దొరికాయి. పోలీసులు 50 కార్లు, 80 పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఎక్కువ మంది వ్యాపారులే. అందరికీ నోటీసులిచ్చి వదిలేశారు. పోలీసులు వస్తున్న విషయం తెలుసుకుని కొందరు పరారయ్యారు. దాంతో పరారైన వ్యక్తులెవరనే దానిపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు.

# ఇంటీరియర్ లో అంకరణకు షోకేస్ లో పెట్టేటటువంటి బొమ్మ







**రాయదుర్గం వెలుతురు ఫిబ్రవరి 13:**

ఫుట్వేర్ డిజైన్ డెవలప్మెంట్ ఇనిస్ట్యూట్ లోని ఫ్యాకల్టీ డాక్టర్. రాంబాబు ముప్పిడి, బృందానికి 10 (పదవ) డిజైన్ పేటెంట్ లభించింది. గురువారం వివరాలు వెల్లడించారు. రాయదుర్గంలోని ఎఫ్ డి డి ఐ (FDDI)లోని డిపార్ట్మెంట్ ఆఫ్ లెదర్ గూడ్స్ యాక్సెసరీస్ డిజైన్ విభాగంలో అధ్యాపకుడు. డాక్టర్. ముప్పిడి ఈయనతో పాటు ఈయన బృందం వీరి బృందం అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణ కుమార్ యాదవ్ నిర్మా యూనివర్సిటీ గుజరాత్ ,శ్రీమతి కలపాల వనజ ఎలైట్ ఇంటర్నేషనల్ స్కూల్ హైదరాబాద్ బ్రెయిన్ స్టామింగ్ డిజైన్ రూపకల్పన కే స్టడీస్ డిజైన్ కలెక్షన్ తదితర వాటిపై పరిశోధన ఆధారంగా తయారు చేసినటువంటి ఇంటీరియర్ డిజైన్ బొమ్మకు అందజేయడం జరిగింది. ఇది రూపకల్పన గల కారణం , కొండపల్లి, రాజమహేంద్రవరంలో తెల్ల పక్షి తయారీ రంగం. ఇలాంటివి చిన్న చిన్న ఆట వస్తువులు ప్లే స్కూల్ విద్యార్థులకు , ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి టీచర్స్ కు టీచింగ్ లెసన్స్ గాను ఇవి ఎంతగానో సహకరిస్తాయి. ఆకర్షణ నియమం సుందర ప్రదేశాల్లో పెట్టుకొన్నకు ఉపయోగపడుతుంది.

భారతదేశంలో ఉన్నటువంటి హస్తకళలను ప్రోత్సహించుటలో భాగంగా కళాకారులతో నిర్మల్ పట్నంలో చేతికళాకారులతో కలిపి నేను పని చేసినప్పుడు వారి దగ్గర ఉన్నటువంటి పనితనాన్ని , వారి చేసేటటువంటి ఉత్పత్తులను పరిశీలించి దానిపైన నేను నా యొక్క పీహెచ్డీ సిద్ధాంతాన్ని సిద్ధాంత గ్రంధాన్ని సబ్మిట్ చేయడం జరిగింది. ఆ సమయంలో నేను వెతికినటువంటి డయాగ్రమ్స్ లో పక్షులతో కూడినటువంటి చిత్రాలను గ్రహించడం జరిగింది. వాటిలో సింగిల్ ఆబ్జెక్ట్స్ లో ఉన్నవి మాత్రమే గుర్తించటం అయినది. పక్షుల చిన్న పిల్లలు ఆడుకునేటటువంటి పక్షుల రూపకల్పన విద్యార్థులకు ఎంతగానో ఆసక్తి ఉంటుంది. అంతేకాకుండా చేతికళాకారుల నిర్మల్ , ఏటికొప్పాక , కొండపల్లి మరియు రాజమహేంద్రవరం తెల్ల పక్షుల హస్త తయారీదారులకు వీరికి మద్దతు ఇచ్చినట్టు ఉంటుంది. కాబట్టి దీనిని ప్రయోగాత్మకమైనటువంటి వివిధ స్కెచ్ ల తోటి మొదటగా రూపించి ఆ తర్వాత కంప్యూటర్ డిజైనింగ్ ద్వారా తయారు చేయడం జరిగింది. ఆ తర్వాత దీనిని ఫిజికల్ గా తయారుచేసి సంవత్సరాంతరం ఎగ్జిబిషన్స్లో ఏవైతే అవార్డు పొందినావో వాటిని ఏర్పాటు చేయుటకు ఆలోచిస్తున్నాను.

ప్రభుత్వం వారి తరపున హస్త కళాకారులకు అవార్డుల ప్రధానోత్సవం లో భారతదేశంలో ఆంధ్ర , తెలంగాణ రాష్ట్రాల తరపున ఇప్పటికీ నాకు 21 డిజైన్ పేటెంట్లు 10 డిజైన్ పేటెంట్లకు లభించినవి. టైమ్స్ ఆఫ్ ఇండియాలోనూ , సాక్షి దినపత్రికల్లోనూ , విశాలాంధ్ర మరియు ఈనాడులోను ఈటీవీ యువ ప్రోగ్రాం లో మరియు ఆల్ ఇండియా రేడియోలో నా జీవిత చరిత్ర



- పై చిత్రం పరిశోధనలో భాగంగా" క్షేత్ర పరిశీలన , డిజైన్ రూపకల్పన మరియు డిజైన్ పేటెంట్ పొందినటువంటి సర్టిఫికెట్.



రావడం జరిగింది.

ఆంధ్ర , తెలంగాణ తరఫున పిహెచ్డి హ్యాండీక్రాఫ్ట్ పైన పరిశోధన జరిపిన వారిలో నేను మొదటి వాడను. నాకు స్వర్ణ పతకం లభించినందుకు చాలా ఆనందం కలిగింది. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వారి చేత అభినందనలు గవర్నర్ డాక్టర్ తమిళ సై సౌందర్య రాజన్, వైస్ ఛాన్సలర్ , ఆచార్య తంగేడు కిషన్ సార్ మరియు రిజిస్టర్ బట్టు రమేష్ మరియు పిహెచ్డి డాక్టర్ ముసుగు శ్రీనివాసరావు గారు రవీంద్ర భారతి సమక్షంలో2024 సంవత్సరంలో తీసుకోవడం జరిగింది. పి .హెచ్ డి. స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆనాటి గవర్నర్ తమిళ సౌందర్య రాజన్న గారు చెప్పినటువంటి మాటలను " పరిశోధన ఇంతటితో ఆగకుండా చేసుకుంటూ వెళ్ళండి" అన్నటువంటి మాటలు నన్నెంతో ప్రభావితం చేశాయి.

ఇంకా భావితరాలకు ఇంకెన్నో కార్యక్రమాలు ద్వారానే పంచమని పంచామని దేశానికి మంచి పేరు తేవాలన్నది అమె మాటలను అనుసరించి ఈ విధమైనటువంటి ఇచ్చేటటువంటి ప్రోత్సాహక నా వంతుగా సహాయపడగలరులసి కోరుచున్నాను. హస్తకళల పైన డిజైనింగ్ , క్యాడ్ డిజైనింగ్, 2 డి 3డి ప్రస్తుతం నూతనంగా AI ఏఐ వాటిపై నూతన అధ్యాయాన్ని కనపరుస్తూ భావితరాలకు డిజిటలైజేషన్ హ్యాండీక్రాఫ్ట్ ఇవ్వగలను.

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి మరియు మహిళా సాధికారత పథకం: ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (APHDC) నాలాంటి వ్యక్తికి అవకాశం కల్పిస్తే, నేను గ్రామాన్ని మరియు దాని హస్తకళలను మార్చగలనని నాకు నమ్మకం ఉంది. ఉదాహరణకు, కొండపల్లి, ఏటికొప్పాక,



బొబ్బిలి, నూజివీడు, భోనుపల్లి ఉత్పత్తులతో పాటు లెదర్ తోలుబొమ్మలాట మరియు టెర్రకోట వస్తువులను సమర్థవంతంగా మార్కెట్ చేయవచ్చు. 2027 నాటికి గుర్తింపు సాధించే లక్ష్యంతో, భౌగోళిక సూచిక (GI) ట్యాగింగ్‌కు సంబంధించిన ప్రయత్నాలతో సహా పరిశోధనలు నిర్వహించేందుకు వీలుగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మా క్లస్టర్లకు మద్దతు ఇవ్వడానికి నేను కేంద్ర నిధులను కోరతాను. ప్రభుత్వం ఇలాంటి వారికి అవకాశం కల్పిస్తే నేను, హస్తకళలలో పిహెచ్‌డి బంగారు పతక విజేత, మేము మా రాష్ట్ర ఉత్పత్తుల దృశ్యమానతను గణనీయంగా పెంచగలము. 59 పరిశోధనా పత్రాలను ప్రచురించాను, ఎనిమిది పుస్తకాలను రచించాను మరియు భారతదేశంలో ఆరు క్రాఫ్ట్ ప్రాజెక్ట్‌లను ప్రారంభించాను, ఇవన్నీ చేతివృత్తుల వారి ఉత్పత్తి సామర్థ్యాలను పెంచడానికి సాధికారత కల్పించే లక్ష్యంతో ఉన్నాయి. ఉచిత డిజైన్ పంపిణీ మరియు డాక్యుమెంటేషన్ మరియు సాఫ్ట్‌స్కిల్స్‌తో ప్రతి హస్తకళాకారులకు మరియు ప్రజలకు అవగాహన కల్పించడానికి ఒక పెద్ద MOU గురించి ఆలోచించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించాలని నేను కోరుకుంటున్నాను

కళాకారులకు జీవితాంత కాలం డిజైన్ సపోటారుగాను ,ఉచితంగా వారికి కావలసినటువంటి డిజైన్ మెలకువలు, తదితర వాటిలో ఆ యొక్క సహాయం ఎల్లప్పుడూ ఉంటుంది. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను అన్నది ఆలోచన.

అభినందించిన వారిలో హస్తకళలను ప్రోత్సహించే భాగంగా , లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ ఎంపోరియం ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ గోల్కొండ ఎంపోరియం మరియు నిర్మల్ హార్టీసన్స్ అభినందించినారు. టేబుల్ యాక్సెసరీస్ ఇంటీరియర్ యాక్సెసరీస్ అనేకమైనటువంటి అంశాలకు ఇది ఒక ఉదాహరణ. ఈ బృంద సభ్యులను ఎఫ్డిడిఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్ లోహిత్ రెడ్డి మరియు ఫ్యాకల్టీ సభ్యులు అభినందించినారు.

ధన్యవాదాలు.



ఫుట్వేర్ డిజైన్ డెవలప్మెంట్ ఇనిస్ట్యూట్ లోని ఫ్యాకల్టీ
**డాక్టర్. రాంబాబు ముప్పిడి**

# కులగణనపై అసెంబ్లీ తీర్మానం చేస్తుందని అనుకున్నాం

- తూతూ మంత్రంగా చర్చించి పక్కన పడేశారు
- మాజీ స్పీకర్ మధుసూధనాచారి విమర్శలు



**వరంగల్,ఫిబ్రవరి13( వెలుతురు ):**

కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టం తెస్తారని అనుకున్నామని.. తూతూ మంత్రంగా ప్రకటన చేసి చేతులు దులుపుకున్నారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనా చారి అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి కాస్కో అంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. కేసీఆర్ మౌనం.. దాని పర్యావసానం గురించి వైఎస్సార్, చంద్రబాబుకు తెలుసునని.. రాబోయే రోజుల్లో కేసీఆర్ ధాటికి రేవంత్‌రెడ్డి వణికిపోవడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ పార్టీ కడియం శ్రీహరికి ప్రాధాన్యత ఇచ్చి డిప్యూటీ సీఎం పదవి ఇస్తే.. పార్టీకి మోసం చేశాడని మండిపడ్డారు. దమ్ము, ఆత్మ విశ్వాసం ఉంటే ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మళ్లీ పూర్తిస్థాయిలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్ భాస్కర్ మాట్రలాడుతూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాల్సిందేనన్నారు. తూ తూ మంత్రంగా కుల గణనను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని.. విమర్శించారు. బీఆర్ఎస్ ఒత్తికి దిగివచ్చిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని.. రీ సర్వే ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. గుడిసె వాసులకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

# నార్సింగ్ పోలీసుల కస్టడీకి మస్తాన్ సాయి

- నేరాల చిట్టా కూపీలాగనున్న పోలీసులు



**హైదరాబాద్,ఫిబ్రవరి13( వెలుతురు ):**

నటుడు రాజ్ తరుణ్ – లావణ్య కేసులో కీలక నిందితుడు మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. చంచల్ గూడ జైలులో రిమాండ్ లో ఉన్న మస్తాన్ సాయిని కోర్టు అనుమతించడంతో గురువారం కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో మరిన్ని ఆధారాలు రాబట్టేందుకు నార్సింగి పోలీసులు రంగంలోకి దిగారు. సైబర్ నేరం, లైంగిక డాడీ, బ్లాక్ మెయిలింగ్ వంటి దురాగతాల కేసులో యూట్యూబర్ మస్తాన్ సాయి పై పలు అభియోగాలు ఉన్నాయి. రాజేంద్రనగర్ కోర్టు మూడు రోజుల కస్టడీకి అనుమతి ఇవ్వడంతో కస్టడీలోకి తీసుకున్న నార్సింగి పోలీసులు విచారణ చేయనున్నారు. మస్తాన్ సాయి దగ్గర 300 మంది అమ్మాయిల వీడియోలు ఉన్నాయని, అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని లావణ్య ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. లావణ్య ఫిర్యాదు మేరకు సోమవారం మస్తాన్ సాయిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ కేసులో చంచల్ గూడ జైలులో రిమాండ్ లో ఉన్న మస్తాన్ సాయిని నార్సింగి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. లావణ్య ఫిర్యాదు మేరకు ఈ కేసులో మరిన్ని కీలక ఆధారాలు, వివరాలు రాబట్టనున్నారు పోలీసులు. పలువురు అమ్మాయిలతో ప్రైవేట్ గా ఉన్న సమయంలో వీడియోలు రికార్డ్ చేసినట్లు మస్తాన్ సాయిపై ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ గా గడిపిన వీడియోలతో మస్తాన్ సాయి బ్లాక్ మెయిల్ కు పాల్పడుతున్నట్లు గుర్తించారు పోలీసులు. తనకు చెందిన కొన్ని వీడియోలను మస్తాన్ సాయి రికార్డ్ చేశాడని పేర్కొన్న లావణ్య.. వీడియోలను పోలీసులకు అందజేసింది. మస్తాన్ సాయి హార్డ్ డిస్క్ లో 300 వీడియోలకు పైగా ఉన్నట్లు గుర్తించారు పోలీసులు.

# చిలుకూరు పూజారిపై దాడికేసు

- పోలీసుల అదుపులో మరో ఏడుగురు

**రంగారెడ్డి,ఫిబ్రవరి13( వెలుతురు ):**



మొయినాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి కేసులో మరో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు తూర్పు గోదావరి, భద్రాచలం జిల్లాలకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. దాడి జరిగిన తర్వాత పరారీలో ఉన్న నిందితులలో గురువారం ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గత శుక్రవారం రాఘవరెడ్డి 20మంది అనుచరులతో కలిసి రంగరాజన్ ఇంటికి వెళ్లి దాడి చేసిన విషయం తెలిసిందే. దాడి జరిగిన తర్వాత ప్రధాన నిందితుడు రాఘవరెడ్డితో పాటు మరికొంత మందిని అరెస్టు చేశారు. దీంతో మిగతా నిందితులు అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. నిందితుల కోసం ప్రత్యేక టీమ్ లను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు పోలీసులు. రామ రాజ్య స్థాపనకు మద్ధతు ఇవ్వాలని రాఘవరెడ్డి 20 మంది అనుచరులతో అర్చకులు రంగరాజన్ పై దాడి చేశారు. అడ్డొచ్చిన ఆయన కుమారుడిపై కూడా దాడి చేశారు రాఘవరెడ్డి బ్యాచ్. దీనిపై చిలుకూరు బాలాజీ ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందర్ రాజన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి కీలక నిందితులను అరెస్టు చేశారు. మిగత నిందితుల కోసం గాలిస్తు?న్నారు.

# తీర్పులకు..భేటీలకు సంబంధం ఉండదు

- వ్యవస్థల ఆధారంగానే పనితీరు ఉంటుంది
- తీర్పుల్లో రాజకీయ జోక్యాలపై మాజీ సిజెఐ ఖండన

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి13( వెలుతురు ):**



సుప్రీంకోర్టు తీర్పుల విషయంలో రాజకీయ జోక్యం ఉంటుందన్న ఆరోపణలను మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తీవ్రంగా ఖండించారు. చట్ట ప్రకారమే రాజకీయ పార్టీల నేతలకు, కార్యకర్తలకు బెయిల్ ఇచ్చామని, గతేడాది 21,300 బెయిల్ పిటిషన్లు కొట్టేశామని గుర్తుచేశారు. మెజార్టీ వ్యక్తులకు అనుకూలంగా తీర్పులు ఉంటాయన్న ఆరోపణలను ఆయన ఖండించారు. గణపతి పూజ సందర్భంగా తమ ఇంటికి ప్రధాని మోదీ రావడంపై మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ మరోసారి స్పందించారు. భారత న్యాయ వ్యవస్థపై ప్రజలకు అచంచలమైన విశ్వాసం ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. బీబీసీ నిర్వహించే హార్డ్ టాక్ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి స్టీఫెన్ సకూర్ అడిగిన పలు ప్రశ్నలకు జస్టిస్ డీవై చంద్రచూడ్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. అందులో ఆర్టికల్ 370 రద్దు నుంచి ఆయన ఇంట గణేష్ చతుర్ధి వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొనడం వరకు అడిగిన అన్ని ప్రశ్నలకు జస్టిస్ చంద్రచూడ్ చాలా హుందాగా సమాధానమిచ్చారు.ప్రధాని మీకు బాగా సన్నిహితమా అని ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు ఆయన స్పష్టమైన సమాధానం ఇచ్చారు. తమ వ్యవస్థ పరిణతితో వ్యవహరిస్తుందని బదులిచ్చారు. రాజ్యాంగపరం గా ఉన్నత పదవుల్లో ఉన్న ఇద్దరు వ్యక్తుల మధ్య మర్యాదపూర్వక భేటీని అతిగా చూడొద్దని సలహా ఇచ్చారు.. కేసుల తీర్పునకు ఇలాంటి మర్యాదలకు మధ్య సంబంధం లేదని అర్థం చేసుకొనే పరిణతి మా వ్యవస్థలో ఉందని మాజీ సీజేఐ వెల్లడించారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన విషయాన్ని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన తీర్పులను ఆయన ప్రస్తావించారు. ఆర్టికల్ 370 రద్దుకు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని సమర్థించు కున్నారు. రాజ్యాంగం అసలు ఉద్దేశానికి అనుగుణంగా ఆ తీర్పు ఉందన్నారు. ఈసందర్భంగా కశ్మీర్ ఎన్నికల అంశాన్ని ఉదహరించారు. 'జమ్మూకశ్మీర్‌కు సెప్టెంబరు 30, 2024లోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు డెడ్‌లైన్ విధించింది. ఇప్పుడు అక్కడ ప్రజాస్వామ్య యుతంగా ఎన్నుకొన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికార మార్పిడి కూడా శాంతియుతంగా జరిగిందని అంటూ సమాధానమిచ్చారు. ఇదిలాఉంటే, జస్టిస్ డీవై చంద్రచూడ్ సీజేఐగా ఉన్న సమయంలో ఆయన నివాసంలో నిర్వహించిన గణపతి పూజలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న విషయం తెలిసిందే. మహారాష్ట్ర సంప్రదాయ టోపీ ధరించి పూజలో పాల్గొన్న ఫొటోలను ప్రధాని సామాజిక మాధ్యమ ఖాతాలో అప్పట్లో పోస్ట్ చేయడంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. దీనిపై గతంలో జస్టిస్ డీవై చంద్రచూడ్ మాట్లాడారు. ప్రధానమంత్రి రావడంలో తప్పులేదన్న ఆయన.. అది బహిరంగ భేటీయేనని, వ్యక్తిగత సమావేశం కాదన్నారు. అధికార విభజన అంటే న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు సమావేశం కావద్దని, చర్చించవద్దని అర్థం కాదన్నారు. భారత న్యాయవ్యవస్థ.. ఉన్నత వర్గాలు, హిందూ అగ్రవర్ణ పురుషుల ఆధిపత్యంలో ఉందా.. అని స్టీఫెన్ సకూర్ ప్రశ్నకు జస్టిస్ చంద్రచూడ్ ఏకీభవించలేదు. దేశ న్యాయ వ్యవస్థకు మూలాధారమైన జిల్లా న్యాయ వ్యవస్థను ఓ సారి పరిశీలిస్తే.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చేరే వారిలో 50 శాతానికి పైగా మహిళలు ఉన్నారన్నారు. అంతేకాదు.. దేశంలో 60 నుంచి 70 శాతం మేర.. మహిళలు చేరుతోన్నారని ఆయన వివరించారు. దేశంలో మహిళలకు సైతం న్యాయ విద్య చేరువైందని చెప్పారు. జిల్లా స్థాయి న్యాయ వ్యవస్థలో మహిళ సంఖ్య పెరుగుతోందన్నారు. అలాగే మహిళలు సైతంపైకి ఎదుగుతోన్నారని తెలిపారు. అదీకాక తన తండ్రి వైవీ చంద్రచూడ్.. తాను భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నంత కాలం న్యాయస్థానంలో అడుగు పెట్ట వద్దని తనతో చెప్పే వారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అందుకే తాను హార్వర్డ్ లా స్కూల్‌లో మూడు సంవత్సరాలు చదువుకొన్నానని తెలిపారు. అలా తన తండ్రి పదవీ విరమణ చేసిన అనంతరం తొలిసారిగా తాను కోర్టులో ప్రవేశించానని వివరించారు. దేశ న్యాయ వ్యవస్థను ఓ సారి పరిశీలిస్తే.. చాలా మంది న్యాయవాదులు, న్యాయమూర్తులు.. ఈ వృత్తిలోని తొలిసారి ప్రవేశించిన వారేరన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వ హయాంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా మీరేమైనా రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కోవలసి వచ్చిందా? అంటూ అధికార బీజేపీ తన సొంత రక్షణ కోసం కోర్టుపై మొగ్గు చూపిందంటూ న్యూయార్క్ టైమ్స్ సంపాదకీయాన్ని బీబీసీ ప్రతినిధి సకూర్ ప్రశ్నించగా.. డీవై చంద్రచూడ్ సమాధాన మిస్తూ.. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో.. భారత్‌లో ఏకపక్షంగా ఉంటాయనే అపోహను తొలగించాయని చెప్పారు. ఆ క్రమంలో దేశంలోని రాష్ట్రాలను పరిశీలిస్తే.. చాలా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు ఉన్నాయన్నారు. అవి ఈ ఎన్నికల్లో ప్రభావం చూపాయి. అవి రాష్ట్రాలను సైతం పాలిస్తున్నాయని సోదాహరణగా వివరించారు. పరువు నష్టం కేసులో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి శిక్ష విధించడంపై ప్రశ్నించగా.. సుప్రీంకోర్టు తీర్పును ఆ తర్వాత పాజ్ చేసిందని తెలిపారు.

# బిసి రిజర్వేషన్లపై చేతులు దులుపుకుంటే కుదరదు

- అసెంబ్లీలో అందుకు అనుగుణంగా బిల్లులు పెట్టాలి
- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్

**జనగామ,ఫిబ్రవరి13( వెలుతురు ):**



మోసాలు చేయడంలో ఆరితేరిన గుణం కాంగ్రెస్ పార్టీదని, మాటలు చెప్పి మోసం చేయడం ఆ పార్టీకి అలవాటేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. అదో దాఖాబాజ్ పార్టీ అని అన్నారు. జనగామ జిల్లా పర్యటనలో బీసీ బిల్లుపై కవిత స్పందించారు. బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంటే కుదరదన్నారు. అసెంబ్లీలో ఒక్క బిల్లు కాకుండా.. మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యలో 46 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు తేవాలని.. ఉద్యోగాల్లో 46 శాతం రిజర్వేషన్లకు మరొక బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. 42 శాతం స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. ఈ మేరకు బీసీలకు రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు తేవాలన్నారు. బిల్లు పెట్టిన వెంటనే నోటిఫికేషన్ జారీ చేస్తేను ఎన్నికల్లో రిజర్వేషన్లు సాధ్యమవుతాయన్నారు.కానీ, జాప్యం చేసి ఇతరులు కోర్టుకు వెళ్లే అవకాశం ఇచ్చి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం చూస్తున్నట్లుగా నిర్దిష్టమైన సమాచారం ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన ఉద్యమాలకు దిగొచ్చిన ప్రభుత్వం బీసీ బిల్లు పెడుతామని ప్రకటించిందని.. ఇదే బీసీలందరి తొలి విజయమన్నారు. మళ్లీ కుల సర్వేకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని.. 15 రోజుల కాకుండా నెల రోజుల పాటు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో 60శాతం మంది తమ ఇళ్లకు సర్వే చేసే వారు రాలేదని అంటున్నారని.. రీ సర్వేపై ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వాని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్లను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

**కామారెడ్డి,ఫిబ్రవరి13( వెలుతురు ):**

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు కామారెడ్డి ఎస్పీ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగిన ఏరియాలను ఎస్పీ పరిశీలించారు. గతేడాది కాలంగా ఎక్కువగా యాక్సిడెంట్లు జరిగిన ప్రాంతాలను హాట్ స్పాట్‌లుగా గుర్తించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యాసంపల్లి, టెకిర్యాల్ శివార్లను ఆమె పరిశీలించారు. స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేయడం,హెచ్చరిక బోర్డుల ఏర్పాటు అంశాలపై సూచనలు చేశారు. రూరల్ సీఐ రామన్ దేవునిపల్లి ఎస్సై రాజు ఉన్నారు.

# స్వరాష్ట్రంలో రైతులకు వేధింపులు

- లోన్ కట్టకపోతే గేటును ఎత్తుకెళ్తారా..?
- రుణమాఫీ చేయని సీఎంను మరీ ఏం చేస్తారు..?
- ఎక్స్‌వేదికగా బ్యాంకు సిబ్బందిపై తీరుపై కేటీఆర్ మండిపాటు

**హైదరాబాద్,ఫిబ్రవరి13( వెలుతురు ):**



రైతులపై బ్యాంకు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు సరైందికాదని, కొన్ని సంఘటనలు చూస్తే మనసు చలిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. స్వరాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని..కష్టాల్లో ఉన్న పాడి రైతు లోన్ కట్టలేదని.. ఏకంగా ఆ ఇంటికి ఉన్న గేటును బ్యాంక్ సిబ్బంది ఎత్తుకెళ్లారని.. మరి రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని.. మాటతప్పిన ముఖ్యమంత్రిపై చర్య తీసుకునే ధైర్యముందా అని ప్రశ్నించారు. రుణం తీర్చలేదని రైతుపై చూపిన ప్రతాపాన్ని.. రుణమాఫీ చేయని సీఎం రేవంత్ రెడ్డిపై చూపించగలరా.. అని అన్నారు. పేద రైతు కు ఒక న్యాయం.. పదవిలో ఉన్న వారికి మరో న్యాయమా.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు గుర్తు పెట్టుకోవాలని, రైతులు అంతా గమనిస్తున్నారని.. ఇలాంటి ఘోరాలను చూస్తూ ఊరుకోరని.. కాంగ్రెస్ నేతల్ని ఇంటి గేటు కూడా తొక్కనియ్యరని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాగా బ్యాంకులో తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదని బ్యాంకు అధికారులు ఇంటి గేట్లు ఎత్తుకెళ్లిన ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడునూతులలో తండా మంజుల, మద్దెబోయిన ప్రేమలతలకు పాడిగేదెల కోసం జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉన్న డీసీసీబీ రూ.8.72 లక్షల రుణం 2021 అక్టోబరులో ఇచ్చింది. ఒక్కో గ్రూపునకు ఐదుగురు చొప్పున రెండు గ్రూపుల్లో మొత్తం 10మంది తలా ఒక పాడిగేదె కొన్నారు. అయితే కొంత అప్పు కట్టినా రెండు గ్రూపులు కలిపి మొత్తం రూ.7 లక్షల బాకీ చెల్లించలేదు. వాస్తవానికి 2023లోనే ఈ రుణ వాయిదాలు పూర్తి కావాల్సి ఉంది. దీంతో బ్యాంకు అధికారులు లబ్ధిదారులకు 2023 అక్టోబరులో లీగల్ నోటీసులు పంపారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో బుధవారం లబ్ధిదారుల ఇంటికి బ్యాంకు సిబ్బంది లీగల్ నోటీసులు ఇవ్వడానికి వెళ్లారు. ఈ సందర్భంగా గట్టిగా అడగడంతో రూ.3 లక్షలు చెల్లించారు. అయితే రెండు రోజుల్లో మొత్తం చెల్లిస్తామన్నా వినకుండా బ్యాంకు సిబ్బంది తమ ఇంటి గేట్లు తీసుకెళ్లారని మద్దెబోయిన ప్రేమలత ఆరోపించారు. అయితే వారే తమ గేట్లు తీసుకెళ్లమన్నారని డీసీసీబీ కొడకండ్ల బ్రాంచ్ మేనేజర్ కళ్యాణి తెలిపారు.

## మాలలతో మాదిగలే తట్టుకోలేదు... మహార్, నేతకాని కులస్థులు ఎలా తట్టుకుంటారు..?


- రిజర్వేషన్ ఫలాలు అందరికీ దక్కాలి
- మహార్, నేతకాని కులాలకు న్యాయం జరిగేలా చూస్తా : మందకృష్ణ మాదిగ



**హైదరాబాద్,ఫిబ్రవరి13( వెలుతురు ):**
రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగ సామాజిక వర్గమే మాలలతో తట్టుకోలేకపోయిందని, వర్గీకరణ గ్రూపు-3లో ఉన్న మహార్, నేతకాని కులస్థులు ఎలా తట్టుకుంటారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్ వర్గీకరణ సరైందని, రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాలని చెప్పారన్నారు. జాతీయ మహార్ నేతకాని ఐక్య వేదిక ఆధ్వర్యంలో వేదిక నాయకులు నారాయణ దుర్గే మహార్ అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహార్, నేతకానిలకు ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేసి రిజర్వేషన్ కేటాయించాలనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో మందకృష్ణ మాదిగ, పెద్దపల్లి మాజీ ఎంపీ డాక్టర్ బోర్లకుంట వెంకటేష్ నేత ముఖ్య అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. మహార్, నేతకాని కులాలకు అన్యాయం జరగకుండా చూస్తానన్నారు. దళితుల జీవితాలను బాగు చేసిన అంబేడ్కర్ మహార్ జాతికి చెందిన వారేనన్నారు. దళితులలో 59 కులాలకు దక్కాల్సిన వాటాను ఒక్క మాల కులమే ఇప్పటి వరకు అనుభవించిందని ఆరోపించారు. సర్టిఫికెట్‌ల కోసం మహార్, నేతకానిలు తమ అస్థిత్వం కోల్పోవద్దని, తహసీల్దార్‌ల ద్వారా కుల సర్టిఫికెట్ సాధించుకోవాలని సూచించారు.

## సర్వే పేరుతో ఇంటికొచ్చి పట్టపగలే దోచుకెళ్లారు...

- ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని కట్టేసి.. 18 తులాల బంగారం అపహరణ
- ఖమ్మంలో ఘటనల.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**హైదరాబాద్,ఫిబ్రవరి13( వెలుతురు ):**
ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారా.. అయితే తస్మాత్ జాగ్రత్త.. సర్వే పేరుతో, ఇంకా ఏ ఇతర అవసరాల కోసమే తలుపు కొడితే ఒక్క క్షణం ఆలోచించండి. తలుపు తీశారో.. మీ ఇల్లు గుల్లవుతుంది. ప్రతిఘటిస్తే.. మీ ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. తాజాగా అలాంటి ఘటనే ఖమ్మం జిల్లాలో వెలుగుచూసింది. వైరా మున్సిపాలిటీ సుందరయ్య నగర్‌లో శీలం యుగంధర్ రెడ్డి ఇంటి వద్దకు పట్టపగలే కారులో నలుగురు దుండగులు వచ్చారు.. సర్వేకి వచ్చామంటూ తలుపు కొట్టారు. ఆపై నలుగురు దుండగులు ఇంట్లోకి ప్రవేశించారు. ఒంటరిగా ఉన్న వృద్ధురాలు వెంకట రావమ్మ (65)ను సర్వే పేరుతో వివరాలు అడుగసాగారు. బయట ఎవరూ లేరని నిర్ధారించుకుని ఒక్కసారిగా దాడి చేసి కాళ్లు, చేతులు కట్టేసి..నోటికి ప్లాస్టర్ వేశారు. అనంతరం చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో బీరువాలో దాచి ఉంచిన 15 లక్షల రూపాయల విలువైన 18 తులాల బంగారు నగలు చోరీ చేసి కారులో పరారయ్యారని బాధితురాలు తెలిపింది. కుమారుడు శీలం యుగంధర్ రెడ్డి ఉద్యోగరీత్యా కొత్తగూడెం వెళ్లాడు. కోడలు ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలని టార్గెట్ చేసిన దొంగలు సర్వే పేరుతో ఇంట్లోకి వచ్చి చోరీకి తెగబడ్డారు. మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చిన కోడలకు చోరీ సంఘటన తెలుసుకొని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఏసిపి రహమాన్ సిఐ సాగర్ ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజు పరిశీలించి కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించిన దుండగులు.. దొంగల కోసం గాలింపు చేపట్టారు.

## వల్లభనేని వంశీని అరెస్టు చేసిన పోలీసులు



**అమరావతి,ఫిబ్రవరి13( వెలుతురు ):**
వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వల్లభనేని వంశీని ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఉదయం ఏడు గంటలకు హైదరాబాద్‌లో ఆయన ఇంటికి చేరుకున్న పోలీసులు, నోటీసులు ఇచ్చి అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఆయనను తరలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం టీడీపీ ఆఫీసుపై వైసీపీ నేతలు దాడి చేశారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే వంశీ నిందితుడిగా ఉన్నారు.

కొన్ని రోజుల కిందటే వంశీ అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పట్నుంచి వంశీ కోసం గాలి స్తున్నారు. వంశీ ఆచూకీ పోలీసులకే కాదు.. సొంత పార్టీ నేతలకు కూడా తెలియలేదు. 2023, ఫిబ్రవరి 20న గన్నవరం టీడీపీ కార్యాలయంపై అప్పటి ఎమ్మెల్యే వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు. సుమారు 5 గంటలపాటు టీడీపీ కార్యాలయంలో విధ్వంసం సృష్టించారు. దీనిపై అప్పట్లో టీడీపీ నాయకులు కేసులు పెట్టినా పోలీసులు విచారణను అటకెక్కించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ ఈ కేసు ఊపిరిపోసుకుంది. అప్పట్లో విధ్వంసం సృష్టించిన వారిలో 20 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# సరిహద్దుల్లో స్థిరంగానే పరిస్థితులు


- పూంఛ్ ఘటనపై సైన్యం వివరణ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి13( వెలుతురు ):**
భారత్-పాక్ సరిహద్దుల్లో పరిస్థితి నిలకడగానే ఉందని భారత సైన్యం ప్రకటించింది. తాజాగా నేడు పాక్ కవ్వింపులకు గట్టిగా బుద్ధి చెప్పిన నేపథ్యంలో ఆర్మీ స్పందించింది. ఇక్కడ అస్థిర పరిస్థితులు నెలకొన్నట్లు వచ్చిన వార్తలను ఖండించింది. కాల్పుల విరమణ స్థిరంగా కొనసాగుతోందని పేర్కొంది. జమ్మూకశ్మీర్‌లో పూంఛ్ జిల్లా కృష్ణ ఘాటి సెక్టార్‌లో బుధవారం రాత్రి కాల్పుల విరమణ ఉల్లంఘన చోటుచేసుకుంది. నియంత్రణ రేఖ వెంబడి తార్కుండి ప్రాంతంలో ఉన్న ఫార్వర్డ్ పోస్ట్‌పై పాక్ సైన్యం కాల్పులను భారత బలగాలు తిప్పికొట్టాయి. వీటిల్లో శత్రువుల వైపు 'భారీగా ప్రాణనష్టం' జరిగిందని భద్రతా అధికారులు వెల్లడించారు. అయితే, మృతుల సంఖ్య వివరాలను మాత్రం స్పష్టంగా చెప్పలేదు. కాల్పుల విరమణ ఉల్లంఘనకు సంబంధించి ఈ ఏడాదిలో ఇదే తొలి ఘటన. అయితే, గత కొన్ని రోజులుగా వివిధ మార్గాల్లో పాక్ కవ్వింపులకు పాల్పడుతూనే ఉంది. ఫిబ్రవరి 4, 5 తేదీల మధ్య అర్ధరాత్రి కొంతమంది చొరబాటుదారులు భారత భూభాగంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా భారత సైన్యం వారిపై కాల్పులు జరిపింది. ఈ ఘటనలో ఏడుగురు హతమయ్యారు. వీరిలో కొందరు పాక్ భద్రతా సిబ్బంది ఉన్నట్లు సమాచారం. ఇక, ఫిబ్రవరి 8న రాజౌరీ సెక్టార్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఓ సైనికుడికి గాయాలయ్యాయి. జమ్మూ కశ్మీర్‌లోని అఖ్నూర్ సెక్టార్ సమీపంలో నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వద్ద మంగళవారం జరిగిన బాంబు పేలుడులో ఇద్దరు సైనికులు మరణించారు. మరొకరు గాయపడ్డారు. మృతుల్లో ఒకరు కెప్టెన్. 'భారత్-పాక్ సైన్యాల మధ్య పరస్పర అవగాహనతో కాల్పుల విరమణ ఒప్పందం చెక్కుచెదరకుండా కొనసాగుతోంది. సరిహద్దుల వద్ద కాల్పులు, ఐఈడీ పేలుడు వంటి ఘటనలతో కొంత కలకలం రేగింది. కానీ, ఇప్పటికే ఉద్రిక్తతలు తగ్గించేందుకు ఏర్పాటుచేసిన వ్యవస్థతో పరిస్థితిని అదుపు చేశాము. ఎటువంటి భారీ క్యాలిబర్ ఆయుధాలతో కాల్పులు జరగలేదని భారత సైన్యం ఓ ప్రకటనలో వెల్లడించింది. చెదురుమదురు ఘటనలు మాత్రమే చోటు చేసుకొన్నాయన్న సైన్యం.. అసాధారణ పరిస్థితి నెలకొందన్న ప్రచారాన్ని తోసిపుచ్చింది. చిన్న ఘటనలు ఇక్కడ అసాధారణమేమీ కాదని తెలిపింది. భారత్ ఆందోళనలను పాక్ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొంది. ప్రస్తుతం పరిస్థితి స్థిరంగా ఉందని పేర్కొంది. నియంత్రణ రేఖ వద్ద భారత సైన్యం పూర్తి అప్రమత్తతో ఉన్నట్లు వెల్లడించింది. నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖ వద్ద బుధవారం సాయంత్రం పాకిస్తాన్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించింది. పాకిస్తాన్ సైన్యం వరసగా అనేక రౌండ్లు కాల్పులు జరుపుతూ కవ్వింపు చర్యలకు పాల్పడటంతో.. భారత బలగాలు కూడా అందుకు ధీటుగా బదులిచ్చాయి. మన దేశ సైన్యం శత్రువుల కాల్పులను సమర్థంగా తిప్పికొట్టంతో దాయాది సైన్యం నుంచి కాల్పులు ఆగిపోయాయి. శత్రుసైన్యం తోకముడుచుకుని పారిపోయింది.భారత సైనికులను లక్ష్యంగా చేసుకోవడానికి ఉగ్రవాదులు ముళ్ల తీగల కంచె దగ్గర ఐఈడీని అమర్చారని వర్గాలు తెలిపాయి. పూంచ్ సెక్టార్‌లోని ఎల్‌ఓసీ వద్ద జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడులో ఒక సైనికుడు గాయపడ్డాడని వర్గాలు తెలిపాయి. తాజాగా పాక్ బలగాలకు దుశ్చర్యకు ప్రతిగా భారత సైన్యం బదులిచ్చి దాయాది సైన్యానికి భారీ నష్టం కలిగించి చెమటలు పట్టించింది. అంతేకాదు.. శత్రుసైన్యం వైపు పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోనట్లు వార్తలు వస్తున్నాయి.జమ్మూలోని అఖ్నూర్ ఎల్‌ఓసీ సమీపంలో ఉగ్రవాదులు ఐఈడీని అమర్చి పేల్చారు. ఈ దాడిలో ఒక భారత కెప్టెన్ సహా ఇద్దరు సైనికులు అమరులయ్యారు. ఒక సైనికుడు గాయపడ్డాడు. ఒక పక్క పాకీ ఆర్మీ వరస దాడులు చేస్తుంటే.. మరో పక్క ఉగ్రవాదులు చొరబాటు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో పాకిస్థాన్ కుట్రలను నిలువరించేందుకు భారతసైనికులు నిఘా కఠినతరం చేశారు.

# ఎన్నాళ్లకెళ్లకు..

## గ్రూప్2 మెయిన్ పరీక్షపై ఏపీపీఎస్సీ కీలక ప్రకటన




**అమరావతి,ఫిబ్రవరి13( వెలుతురు ):**
ఆంధ్రప్రదేశ్ గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) జారీ చేసింది. త్వరలో నిర్వహించనున్న గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను గురువారం (ఫిబ్రవరి 13) విడుదల చేసినట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను అభ్యర్థులు ముందుగానే డౌన్‌లోడ్ చేసుకుని అందులోని సూచనలను పాటించాలని పేర్కొంది. గతంలో ఇచ్చిన ప్రకటన మేరకు గ్రూప్ 2 మెయిన్స్ పరీక్ష జనవరి 5వ తేదీన నిర్వహించవల్సి ఉంది. కానీ అప్పట్లో మెగా డీఎస్సీ హడావిడిలో ఈ పరీక్ష నిర్వహణ సాధ్యంకాదని కమిషన్ వాయిదా వేసింది. అయితే నాటకీయ పరిణామాల దృష్ట్యా మెగా డీఎస్సీ ప్రకటన వెలువడకపోగా మరింత ఆలస్యమైంది. ఇందుకోసం వాయిదా వేసిన గ్రూప్ పరీక్ష కూడా చాలా రోజుల వరకు వాయిదా పడింది. మరోవైపు టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాలన్నీ బిజీగా మారనున్నాయి. అందుకే ఈ పరీక్షలన్నింటికంటే ముందుగానే గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని భావించిన కమిషన్.. ఆ మేరకు ఫిబ్రవరి 23వ తేదీన నిర్వహించాలని నిర్ణయించింది. గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఫిబ్రవరి 23న మొత్తం 13 జిల్లా కేంద్రాల్లో జరగనున్నాయి. పేపర్ 1 ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, పేపర్ 2 పరీక్ష సాయంత్రం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించనుంది. కాగా గత ప్రభుత్వ హాయంలో గతేడాది డిసెంబర్ 7న గ్రూప్ 2 నోటిఫికేషన్‌ను విడుదల చేయగా.. అనంతరం రెండు నెలల వ్యవధిలోనే అంటే ఈ ఏడాది ఫిబ్రవరి 25న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించింది. ఈ పరీక్షకు 4,83,535 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. వారిలో 4,04,037 మంది పరీక్షకు హాజరయ్యారు. ఏప్రిల్ 10న గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. ఇందులో 92, 250 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఇప్పటి వరకూ గ్రూప్ 2 మెయిన్స్ పరీక్ష తేదీని రెండు సార్లు వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 23వ తేదీన మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ స్పష్టం చేసింది. కాగా మొత్తం 905 పోస్టుల భర్తీకి ఈ నియామక ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే.

# పదో తరగతి పరీక్షల్లో కీలకమార్పు

- విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ సూచన
- మార్చి 6 నుంచి మార్చి 15వ తేదీ ప్రీఫైనల్...
- మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పబ్లిక్ పరీక్షలు




**హైదరాబాద్,ఫిబ్రవరి13( వెలుతురు ):**
తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి వార్షిక పరీక్షల్లో కీలక మార్పు తీసుకురానున్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఓఎంఆర్ పత్రంలో వివరాలను నింపడం నుంచి తదితర అంశాలను కొత్తగా చేర్చనున్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షల్లోనే నమూనా ఓఎంఆర్ పత్రాలను అందించాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రీ ఫైనల్ పరీక్షలు మార్చి 6 నుంచి మార్చి 15వ తేదీ వరకు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షల్లో టెన్త్ విద్యార్థులందరికీ ఓఎంఆర్ పత్రాలను అందించనున్నారు. విద్యార్థులకు అందించే ఈ ఓఎమ్ఆర్ పత్రాల్లో ప్రతి విద్యార్థి తనకు ఇచ్చిన ఆన్సర్ బుక్‌లెట్ సంఖ్యను రాయాల్సి ఉంటుంది. అలాగే దానిపై సంతకం కూడా చేయాలి. విద్యార్థికి సంబంధించిన ఇతర వివరాలు కూడా అందులో ముందుగానే ముద్రించి ఉంటాయి. వాటిని విద్యార్థులు సరిచూసుకోవాలి. వివరాల్లో తప్పులున్నా.. ఆ ఓఎంఆర్ తనది కాకపోయినా.. విద్యార్థులు వెంటనే ఇన్విజిలేటర్‌కు చెప్పాల్సి ఉంటుంది. అలాగే వారిచ్చే ఇతర నామినల్ రోల్ పత్రంలో సరైన వివరాలను రాయాల్సి ఉంటుంది. ఇక ఈ పరీక్షలు ముగిసిన తర్వాత మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల్లో ప్రతిరోజూ ఓఎంఆర్ పత్రాలను విద్యార్థులకు అందిస్తారు. నేరుగా పబ్లిక్ పరీక్షల్లో ఓఎంఆర్ పత్రాలను ఇవ్వడం వల్ల విద్యార్థులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉంది. అందువల్ల కొందరు విద్యార్థులు తప్పులు చేసే అవకాశం ఉంది. మరికొందరికి సమయం వృథా అయ్యే ఛాన్స్ ఉంది. దీన్ని నివారించేందుకు ప్రీ ఫైనల్ పరీక్షల్లో నమూనా ఓఎంఆర్ పత్రాలను ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. దీనివల్ల విద్యార్థులకు కొంత సాధన అవుతుందని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. అలాగే గత ఏడాది వరకు 4 పేజీల మెయిన్ బుక్‌లెట్ తొలుత జారీ చేసి.. అది సరిపోకపోతే అదనపు షీట్లను ఇచ్చేవారు. దీంతో అదనపు షీట్ల సంఖ్యను కూడా ఓఎంఆర్ పత్రంపై రాసేవారు. అయితే ఈసారి మాత్రం ఇంటర్మీడియట్ తరహాలో 24 పేజీల బుక్‌లెట్‌ను పదో తరగతి విద్యార్థులకు కూడా ఇస్తున్నారు. దీనివల్ల బుక్‌లెట్‌పై అదనపు పత్రాల సంఖ్య రాయవల్సిన అవసరం ఉండదు. ఇలాంటి మార్పులన్నింటి దృష్ట్యా ప్రీ ఫైనల్ పరీక్షల్లో నమూనా ఓఎంఆర్ పత్రాలను అందించాలని విద్యాశాఖ భావిస్తుంది.

## సెంథిల్ బాలాజీ మంత్రిగా కొనసాగాలా ?

- అఫిడవిట్ దాఖలు చేయాలన్న సుప్రీం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి13( వెలుతురు ):**
సెంథిల్ బాలాజీ మంత్రిగా కొనసాగాలా అనే విషయమై అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. చట్టవ్యతిరేకంగా నగదు బట్వాడా కేసులో ఈడీ అరెస్ట్ చేసిన సెంథిల్ బాలాజి, 417 రోజుల అనంతరం బెయిలుపై విడుదలయ్యారు. విడుదలై మరుసటిరోజే ఆయన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మంత్రిగా సెంథిల్ బాలాజి బాధ్యతలు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ చెన్నైకి చెందిన విద్యాకుమార్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. మంత్రి పదవిలో లేననే కారణంతో బెయిలు పొందిన ఆయన, మరుసటిరోజే మంత్రిగా బాధ్యతలు చేపట్టారని, దిగువ కోర్టులో ఈ కేసు విచారణ జరుగుతున్న నేపథ్యంలో, విచారణకు అడ్డంకులు సృష్టించే అవకాశముందని, అందువల్ల ఆయన బెయిలు రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు.

ఈ పిటిషన్ గతంలో విచారించిన న్యాయమూర్తులు, సెంథిల్ బాలాజీకి వ్యతిరేకంగా ప్రశ్నలు వేశారు. ఈ క్రమంలో, ఈ పిటిషన్ బుధవారం మళ్లీ విచారణకు రాగా... సెంథిల్ బాలాజీకి బెయిలు రాక ముందు ఈ కేసులో విచారణ జరిపిన ఫోరెన్సిక్ నిపుణుడు ఇప్పుడు గైర్హాజర య్యారని, ప్రస్తుతం ఆయన మంత్రిగా ఉండడంతో నిపుణుడు భయంతో విచారణకు హాజరుకాలేదని, అందువల్ల సెంథిల్ బాలాజీ బెయిలు రద్దు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం న్యాయవాది వాదించారు. సెంథిల్ బాలాజి మంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు అంత అవసరం ఎందుకని న్యాయమూర్తులు ప్రశ్నించారు. 200 మంది ప్రభుత్వ ఉద్యోగులు సాక్ష్యులుగా ఉన్న నేపథ్యంలో, ఆయన మంత్రిగా ఉంటే ఏం జరుగుతుంది? సెంథిల్ బాలాజి మంత్రిగా కొనసాగాలా? అనే విషయం ఆయన తరపు వివరణ చెప్పండి. అలా ఆయన మంత్రిగా కొనసాగే పక్షంలో, ప్రాధాన్యత ఆధారంగా విచారణ జరిపించవచ్చంటూ, తదుపరి విచారణ మార్చి 4వ తేదీకి వాయిదావేశారు.

# అతడు నన్ను ఎంతో వేధించాడు : ఐశ్వర్య రాజేష్



దక్షిణాది చిత్రపరిశ్రమలో కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ ఐశ్వర్య రాజేష్. అచ్చ తెలుగు అమ్మాయి అయినప్పటికీ కోలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ డమ్ సంపాదించుకున్న ముద్దుగుమ్మ. ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో తెలుగులో భారీ విజయాన్ని అందుకుంది. డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య తన సినీ కెరీర్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. తన తల్లి నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానని తెలిపింది. చిన్నతనంలోనే తన తండ్రి చనిపోయారని.. దీంతో అమ్మ ఒక్కరే ఎంతో కష్టపడి తమను పెంచిందని.. ఈ ప్రయాణంలో ఆమె మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడిందని తెలిపింది. చిన్న వయసులోనే పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేశానని.. ఆ తర్వాత సినీరంగంలోకి అడుగుపెట్టినట్లు చెప్పుకొచ్చింది. రిలేషన్ షిప్ గురించి మాట్లాడుతూ.. లవ్ కంటే కూడా బ్రేకప్ అయినప్పుడు వచ్చే బాధ అంటే భయం. ప్రేమించే సమయం కంటే అది మిగిల్చిన బాధ నుంచి బయటకు రావడానికే ఎక్కువ సమయం తీసుకుంటాను. గతంలోనూ నేను రిలేషన్ లో ఉన్నానని తెలిపింది. సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఓ వ్యక్తిని ప్రేమించానని.. అతడు తనను ఎంతో వేధించాడని.. అంతకంటే ముందు కూడా అలాంటి ప్రేమనే చూశానని.. రిలేషన్ షిప్ లో ఎందుకు ఇలా జరుగుతుందని భయపడ్డానని.. ప్రస్తుతానికి ఎంతో సంతోషంగా ఉన్నట్లు చెప్పుకొచ్చింది.

# ఆయన నాకు దైవంతో సమానం



మెగాస్టార్ చిరంజీవి తనకు, తన కుటుంబానికి దైవంతో సమానం అని చెబుతోంది హీరోయిన్ ఊర్వశీ రౌతెల ఆయన మాకు ఏమీ కారు.. సినిమాలో నటించిన చిన్న పరిచయం అంతే. కానీ కష్టంలో ఎంతో అండగా నిలిచారు. అందుకే ఆయన్ను దైవంలా భావిస్తున్నామని, తమ బలానికి ఆయనొక లైట్‌హౌస్ లాంటివారని అంటోంది ఊర్వశీ. ఇంతకీ ఏం జరిగిందంటే. ఇటీవల ఊర్వశీ తల్లి మీను రౌతెల ఆస్పత్రి పాలైంది. ఆమె ఎడమ కాలిలో ఎముకలో ఇంట్రా ఆర్టిక్యూలర్ ఫ్రాక్చర్ అయింది. అదెంతో ప్రమాదకరమని వైద్యులు చెప్పగా ఊర్వశీ చిరంజీవిని సహాయం కోరింది. అందుకు స్పందించిన చిరంజీవి కోల్‌కత్తా అపోలో ఆస్పత్రి బృందంతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చేశారు. డాక్టర్లు సర్జరీ చేయడంతో ఆమె ఆ సమస్య నుంచి గట్టెక్కింది. ఈ విషయమై తమ కుటుంబం చిరంజీవికి జీవిత కాలం రుణపడి ఉంటామని చెబుతోంది. "చిరంజీవిగారి సేవా కార్యక్రమాల గురించి ఎంతో విన్నాను. 'వాల్తేరు వీరయ్య' సాంగ్ షూటింగ్‌లో నేను ఆయన్ను ఎంతో గమనించాను. ఆపద అన్నవారికి నేను చూస్తుండగానే ఎంతో సాయం అందించారు. ఆ సాయం నా వరకూ కూడా వచ్చింది. అమ్మ ఎడమ కాలి ఎముకకు పెద్ద సమస్యే వచ్చింది. ట్రీట్‌మెంట్ విషయంలో ఎక్కడా సరైన సమాధానం దొరకలేదు. అప్పుడు చిరంజీవిగారి సాయం కోరాను. ఎంతో మొహమాటంగా అడిగాను.

# బ్యాగ్రౌండ్ లేకున్నా... తనదైన శైలిలో సినిమాలు...

సోషల్ మీడియాలో సినీతారల చిన్ననాటి ఫోటోస్ తెగ వైరలవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా మరో హీరోయిన్ చైల్డ్ హుడ్ పిక్ నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. పైన ఫోటోలో తన తండ్రితో కలిసి ఉన్న చిన్నారి ఎవరో తెలుసా.. ? తెలుగు సినీ పరిశ్రమలో నటిగా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఎలాంటి ఫిల్మ్ బ్యాగ్రౌండ్ లేకుండానే సినిమాల్లోకి అడుగుపెట్టి సహజ నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగుతోపాటు తమిళంలోనూ వరుస ఆఫర్స్ అందుకుంది. ఇప్పటివరకు ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. ఇటీవలే భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమాలోనూ కీలకపాత్ర పోషించింది. ఎలాంటి పాత్రలోనైనా అవలీలగా జీవించే అందమైన హీరోయిన్. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా..? తనే హీరోయిన్ అంజలి. ఏపీకి చెందిన ఈ అమ్మాయి.. జీవా నటించిన డేర్ సినిమాతో తెరంగేట్రం చేసింది. తర్వాత 2006లో ఫోటో సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. అయితే ఈ రెండు సినిమాలు అంజలికి అంతగా గుర్తింపు తీసుకురాలేదు. కానీ తమిళంలో సూపర్ హిట్ అయిన షాపింగ్ మాల్ సినిమాతో ఈ అమ్మడు క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఆ చిత్రాన్ని తెలుగులో డబ్ చేయగా.. అదే స్థాయిలో రెస్పాన్స్ వచ్చింది. డైరెక్టర్ మురుగదాస్ తెరకెక్కించిన జర్నీ సినిమాతో మరోసారి అడియన్స్ ముందుకు వచ్చింది. ఈ రెండు సినిమాలు అంజలి కెరీర్ మలుపు తిప్పాయి. 2013లో వచ్చిన సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలో సీత పాత్రలో కనిపించింది. అంజలి.. అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసింది. ఆ తర్వాత అనేక చిత్రాల్లో నటించింది. గ్లామర్ షోలు కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఎంపిక చేసుకుంటూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. అలాగే లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లోనూ నటించి మెప్పించిన అంజలి.. ఇటీవలే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ మూవీలో కీలకపాత్ర పోషించింది. డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కియారా అద్వానీ కథానాయికగా నటించిన సంగతి తెలిసిందే.



# ఆ రెండు సినిమాల్లో నటించడం నా అదృష్టం

## - నిధిఅగర్వాల్

నిధీ అగర్వాల్ మంచి ఫామ్‌లో ఉన్నారు. సక్సెస్‌లు లేకపోయినా అవకాశాలు మాత్రం బాగానే వరిస్తున్నాయి. ఇప్పటికే ఆమె రెండు భారీ చిత్రాల్లో అగ్ర హీరోల సరసన నటిస్తోంది. ప్రస్తుతం 'హరిహర వీరమల్లు', 'ది రాజాసాబ్'తో ఈ ఏడాది ప్రేక్షకులకు వినోదాన్ని అందించనుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె తన అప్‌కమింగ్ సినిమాల గురించి మాట్లాడారు. 2022లో గ్యాప్ తీసుకోవడానికి గల కారణాన్ని వివరించారు. 'హరిహర వీరమల్లు' లో నా పాత్ర ఇప్పటివరకు నేను చేసిన వాటిల్లో అత్యుత్తమమైనది. ఆ పాత్ర కోసం గుర్రపు స్వారీ, క్లాసికల్ డ్యాన్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. కథక్ నేర్చుకున్నాను. నా కల నిజమైంది. అదృష్టవంతురాలిని అని అనిపించింది. అలాగే హర్రర్ సినిమాలంటే గతంలో భయం ఉండేది. అందుకే 'ది రాజా సాబ్' చేయాలనుకున్నాను. సెట్‌లో స్క్రిప్ట్ చదువుతున్నప్పుడు కూడా అందరం నవ్వుతూనే ఉన్నాం" అని అన్నారు. సెట్‌లో విషయానికొస్తే.. పవన్ కల్యాణ్, ప్రభాస్ నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. పవన్ సెట్స్‌లో ఉన్నప్పుడు ఎంతో ఏకాగ్రతతో ఉంటారు. యాక్షన్ చెప్పగానే పూర్తిగా పాత్రలోకి వెళ్లిపోతారు. చుట్టూ ఏం జరుగుతున్నా పట్టించుకోరు. ఆ సన్నివేశంపై మాత్రమే దృష్టిపెడతారు. ఈ లక్షణాన్ని నేను కూడా అలవాటు చేసుకోవాలి. ప్రభాస్ ఫన్నీ పర్సన్. ఈ రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తాయా అని ఆతురతగా ఎదురుచూస్తున్నా" అని అన్నారు.



# అనారోగ్యం వల్ల ఒక్కోసారి వైవాహిక జీవితంలో భారీ మూల్యం

## విడాకులపై సమంత కామెంట్

అక్కినేని నాగచైతన్య, సమంత 2017లో ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఈ జంట... 2021లో విడాకులు తీసుకుంది. అయితే... విడాకులకు కారణాలు వీరిద్దరూ వేర్వేరుగా చెప్పడమే కొన్ని సార్లు చర్చనీయాంశం అవుతోంది. ఆ మధ్య ఓ పాడ్ కాస్ట్ లో నాగచైతన్య 'తాను సమంత పరస్పర అంగీకారంతోనే విడాకులు తీసుకున్నామ'ని చెప్పాడు. మాకున్న వ్యక్తిగత కారణాలతో ఎవరి మార్గంలో వారు ప్రయాణం చేయాలని అనుకున్నాం. అందుకే విడాకులు తీసుకున్నాం' అని స్పష్టం చేశాడు. తాజాగా సమంత మాత్రం విడాకులు విషయంలో వేరే వర్షన్ ను చెప్పింది. ప్రతి మనిషి మానసికంగానే కాకుండా శారీరకంగానూ ఎంతో ఆరోగ్యంగా ఉండాలి. అలా లేని పక్షంలో దాని ప్రభావం వైవాహిక జీవితం మీద పడుతుందని తెలిపింది. జీవిత భాగస్వామి ఎంత విశాల హృదయుడైనా... ఎంత మనసున్నవాడైనా... ఒక్కోసారి పార్టనర్ అనారోగ్యం కారణంగా వారి మధ్య గ్యాప్ ఏర్పడుతుందని ఇన్ డైరెక్ట్ గా చెప్పింది. లైఫ్ పార్టనర్ పట్ల మనకు ఉన్న ప్రేమను వ్యక్తం చేయడంలో ఒక్కోసారి అనారోగ్యం అడ్డుపడుతూ ఉంటుందని, దాంతో భారీ మూల్యం చెల్లించాల్సి రావొచ్చని నర్మగర్భంగా సెలవిచ్చింది. మొత్తం మీద తన అనారోగ్యమే విడాకులకు పరోక్షకారణమని చెప్పకనే సమంత చెప్పేసింది. ఇదిలా ఉంటే ఇటీవల శోభితా ధూళిపాలను వివాహం చేసుకున్న నాగచైతన్య 'తండేల్' విజయంతో ముందుకు సాగిపోతున్నాడు. అలానే... సమంత విడాకుల అనంతరం వెబ్ సీరిస్ మీద దృష్టి పెట్టి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుని నటిగా కొనసాగుతోంది. ప్రస్తుతం నిర్మాతగానూ తన సత్తాను చాటాలని తహతహలాడుతోంది.



# ప్రభాస్‌తో కలిసి నా 544వ ప్రాజెక్ట్ చేయడం ఆనందంగా ఉంది

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ భాగమయ్యారు. ఆయన నటిస్తున్న 544వ చిత్రమిది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందంతోపాటు అనుపమ్‌ఖేర్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. "ఇండియన్ చిత్ర పరిశ్రమకు బాహుబలిగా పేరుపొందిన ప్రభాస్ కలిసి నా 544వ ప్రాజెక్ట్ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై టాలెంటెడ్ హను రాఘవపూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అద్భుతమైన కథ.. జీవితంలో ఇంతకంటే ఇంకేం కావాలి ఫ్రెండ్స్ జయహో" అని ట్వీట్ చేశారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతుంది. దీనికి 'ఫౌజీ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. "మీరు ఇంతవరకూ చూడని కథను చూపిస్తున్నాం. ప్రభాస్ ఉన్నారు కాబట్టి ఎన్ని అంచనాలను అయినా అది అందుకుంటుంది. ఇప్పటివరకు ఎప్పుడూ చూడని ప్రపంచంలోకి తీసుకువెళ్తుంది. 'సీతారామం' తర్వాత దీనిని రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టింది. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారు" అని దర్శకుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇందులో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వీ నటిస్తున్నారు.

# పోచంపల్లికి శ్రీనివాస్‌రెడ్డికి నోటీసులు

- నాలుగు రోజుల్లో తమ ముందు హాజరుకావాలని వెల్లడి



**హైదరాబాద్,ఫిబ్రవరి13( వెలుతురు ):**
కోడిపందేల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి మొయినాబాద్ పోలీసులు గురువారం నోటీసులు ఇచ్చారు. కోడి పందాలు జరిగిన ల్యాండ్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి చెందినదిగా పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. మొయినాబాద్ తోల్కట్ట గ్రామం సర్వే నెంబర్ 165/ఏలో ఈ ఫార్మ్‌హౌస్ ఉందని పోలీసులు తెలిపారు. నాలుగు రోజుల్లో ఆధారాలతో తమ ముందు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి హాజరు కావాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో పోచంపల్లిని నిందితుడిగా మొయినాబాద్ పోలీసులు చేర్చారు. సెక్షన్ 3 అండ్ 4 గేమింగ్ యాక్ట్ కింద్ కేసు నమోదు చేశారు. సెక్షన్ 11 యానిమల్ యాక్ట్ కింద మరో కేసు నమోదు చేశారు. ఫార్మ్ హౌస్‌లో బెట్టింగ్స్ చేస్తూ పందాలు ఆడిస్తున్నట్లు మొయినాబాద్ పోలీసులు గుర్తించారు. శ్రీనివాస్ రెడ్డి ఫార్మ్‌హౌస్‌ను సబ్ లీజుకు భూపతి రాజు శివకుమార్ వర్మ అలియాస్ గబ్బర్ తీసుకున్నారు. ఫార్మ్‌హౌస్‌లో భారీ సెటప్‌తో కోడి పందాలను గబ్బర్ నిర్వహించాడు. అయితే కోడిపందాలకు సంబంధించి మరి కొంతమందిని విచారించే అవకాశాలు ఉన్నాయి. కాగా.. మూడు రోజుల క్రితం నగర శివారులో భారీ క్యాసినోను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన కలకలం రేపింది. మొయినాబాద్‌లోని ఫామ్ హౌస్‌పై దాడి చేసిన రాజేంద్రనగర్ పోలీసులు.. కోళ్ల పందాలతోపాటు క్యాసినో నిర్వహిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు. ఈ ఘటనలో 64 మందిని అరెస్టు చేశారు. రూ. 30 లక్షల నగదుతోపాటు 55 కార్లు, 86 కోళ్లు స్వాధీనం పరుచుకున్నారు. పెద్ద మొత్తంలో బెట్టింగ్ కాయిన్స్ కూడా సీజ్ చేశారు. పట్టుబడినవారిలో ఏపీ, తెలంగాణకు చెందినవారు ఉన్నట్లు సమాచారం. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు కలిసి క్యాసినో, కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

# మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట

- ముందస్తు బెయిల్ మంజూరు



**హైదరాబాద్,ఫిబ్రవరి13( వెలుతురు ):**
సినీ నటుడు మోహన్‌బాబుకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. జర్నలిస్టు పై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన సుప్రీంకోర్టులో పిటీషన్ వేశారు. దీనిపై గురువారం విచారణ జరిపిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసును జస్టిస్ సుదాంశ్ దులియా ధర్మాసనం విచారణ జరిపింది. గత విచారణ సందర్భంగా మోహన్‌బాబుపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు తెలంగాణ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా జర్నలిస్ట్‌పై జరిగిన దాడికి తాను బహిరంగంగా క్షమాపణ చెప్పానని.. నష్ట పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని మోహన్ బాబు ధర్మాసనానికి చెప్పారు. కాగా జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సినీ నటుడు మోహన్‌బాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. మోహన్‌బాబు ఆయన కుమారుడు మంచు మనోజ్ మధ్య ఘర్షణల నేపథ్యంలో జల్‌పల్లిలో ఉన్న మోహన్‌బాబు ఇంటికి వార్తల కవరేజీ కోసం వెళ్లిన తనపై మోహన్‌బాబు దాడి చేశారని పేర్కొంటూ జర్నలిస్టు రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పహడీ షరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు కొట్టివేసింది. గత ఏడాది డిసెంబరు 10న మోహన్ బాబు తనయుడు మంచుమనోజ్ విజ్ఞప్తి మేరకు ఆయన వెంట మీడియా మోహన్‌బాబు ఇంటికి రాగా ఆయన ఒక విలేకరి దగ్గరున్న మైక్‌ను లాక్కొని తల మీద కొట్టారు. తీవ్ర గాయాల పాలైన విలేకరిని ఆస్పత్రిలో చేర్చారు. రాచకొండ పోలీసులు మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసుకుసంబంధించి కోర్టులో వాదనల సందర్భంగా జర్నలిస్టు రంజిత్ తరఫు న్యాయవాది వాదిస్తూ, మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని కోరారు. జర్నలిస్టుపై దాడి చేయడమే కాకుండా గొంతు పట్టి నులిమారని చెప్పారు. ఈ మేరకు ఇరు వర్గాలు అఫిడవిట్లు దాఖలు చేశాయి. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మోహన్‌బాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. క్రిమినల్ కేసు కావడంతో డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేసే అవకాశం లేదు. దీంతో ముందస్తు బెయిలు కోసం మోహన్‌బాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# మాజీ ఎమ్మెల్యే నేరాలు అంతాఇంతా కావు

- వైసీపీ పాలనలో వంశీ అనేక దాడుల్లో నేరస్తుడు : కొనకళ్ల నారాయణరావు

**అమరావతి,ఫిబ్రవరి13( వెలుతురు ):**
వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఓ విధ్వంసకారుడని ఆర్టీసీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు అన్నారు. వల్లభనేని వంశీ అరెస్టు నేపథ్యంలో గురువారం టీడీపీ కార్యాలయంలో కొనకళ్ల నారాయణరావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ... 2023లో గన్నవరం టీడీపీ కార్యాలయంపై వల్లభనేని వంశీ దాడి చేయించి విధ్వంసం సృష్టించారని మండిపడ్డారు. అనేక మంది టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టించి వేధించారని అన్నారు. టీడీపీ కార్యాలయంపై ఆయనే దాడి చేయించి టీడీపీ నేతలను అరెస్ట్ చేయించారని చెప్పారు. కొంతమంది తెలుగుదేశం పార్టీ మహిళా నేతలను కూడా జైలుకు పంపించారని మండిపడ్డారు. గన్నవరంలో వంశీ అరాచకాలు అన్నీ ఇన్నీ కావని చెప్పుకొచ్చారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి కొన్ని వందల కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. వల్లభనేని వంశీపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరించాడని ధ్వజమెత్తారు. సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లభనేని



వంశీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు.

**వల్లభనేని చరిత్ర మొత్తం నేరమయం : ఎంపీ ప్రణవ్‌గోపాల్**

ఒక నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు మరో నేరానికి మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పాల్పడ్డారని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంపీ ప్రణవ్ గోపాల్ చెప్పారు. వంశీ గత చరిత్ర అంతా నేర మయమని ఆరోపించారు. జగన్ గ్యాంగ్‌లో చేరి అనేక అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. దళిత యువకుడు సత్యవర్ధన్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లభనేని వంశీ అరెస్టు జరిగిందన్నారు. ఈ అరెస్టును ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ప్రణవ్ గోపాల్ చెప్పారు.

**వంశీ, దేవినేని అవినాష్, కొడాలి నాని చీడపురుగులు : నాదెండ్ల బ్రహ్మం**

వల్లభనేని వంశీ లాంటి వారిని వేటాడే ఆట మొదలైందని టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాదెండ్ల బ్రహ్మం తెలిపారు. వంశీ , దేవినేని అవినాష్ , కొడాలి నాని చీడపురుగులు అని విమర్శించారు. కన్నతల్లి లాంటి పార్టీ కార్యాలయంపై దుర్మార్గులు దాడి చేశారని మండిపడ్డారు. ఎన్టీఆర్ కుమార్తె నారా భువనేశ్వరిని ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడిన వంశీకి తగిన శాస్తి జరిగిందని చెప్పారు. వంశీ అరెస్టుతో కూటమికి ఓటేసిన ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు.నారా లోకేష్ రెడ్ బుక్ ఓపెన్ అయితే రిజల్ట్ ఎలా ఉంటుందో ఈరోజు నుంచి తెలుస్తుందని చెప్పారు. వంశీ, వంశీ అనుచరులు తన ఇంటిపైన దాడికి వచ్చిన సందర్భంలో ఆనాడు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని తెలిపారు. తాను ఇచ్చిన ఫిర్యాదుపై తక్షణమే పోలీసులు చర్యలు తీసుకోవాలని నాదెండ్ల బ్రహ్మం కోరారు.

# రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు

- ప్రభుత్వ వైఫల్యాలపై మండలిలో ప్రశ్నిస్తా : బొత్స సత్యనారాయణ



**అమరావతి,ఫిబ్రవరి13( వెలుతురు ):**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తుందని, ఎప్పుడు అక్రమ కేసులు పెడదామా అని ఎదురుచూస్తుందని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నేత వల్లభనేని వంశీపై మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. వల్లభనేని వంశీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేసు వెనక్కు తీసుకుంటే మళ్ళీ అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. కక్ష పూరిత రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదని.. ఇలాంటివి రాజకీయాలలో సరికాదని పేర్కొన్నారు. ఋషికొండ భవనాలు ప్రభుత్వ కట్టడాలు...నిర్మాణాలలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను మండలిలో ప్రశ్నిస్తామని.. శాసనసభ విషయంలో పార్టీ వైఖరిని తమ వాళ్ళను అడిగి చెప్తానని.. తనకు తెలియని విషయాన్ని తెలుసుకొని చెప్తానని అనడంలో తప్పు లేదు కదా అని బొత్స అన్నారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువులు ధరలు పెరిగిపోతున్నాయని, పండగ కూడా బాగా చేసు కోలేకపోయారని బొత్స సత్యనారాయణ అన్నారు. ఇంకా వేసవి రాకుండానే పవర్ కట్స్ విధిస్తున్నారని, వైసీపీ హయంలో స్కూల్స్ మూసేసారని దుష్ప్రచారం చేశారని అన్నారు. ఇప్పుడు ఫైల్స్ క్లియరింగ్ ఎందుకు ఆలస్యం అవుతుందని స్వయంగా సీఎం చంద్రబాబు చెప్పారు కదా అని బొత్స ప్రశ్నించారు. ఇప్పటికీ ఒక సిలెండర్ మాత్రమే ఇచ్చారని...తల్లి కి వందనం ఇస్తామని అంటున్నారని.. రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవడం లేదని, నిరుద్యోగ భృతి ఏమైందని నిలదీశారు. గత 5 ఏళ్లలో జరిగిన దాని కంటే..ఈ 9 నెలల్లో ఎక్కువ జరిగాయని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వం తప్ప,.. చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. మండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తామన్నారు. గత టీడీపీ, వైసీపీ హయంలో భూకుంభకోణంపై వేసిన సిట్ నివేదికను బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

# పార్లమెంట్ ముందుకు కొత్త ఐటి చట్టం

- నిరసలన మధ్యే ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్
- విపక్షాల వాకౌట్...లోక్‌సభ మార్చి 10కి వాయిదా



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి13( వెలుతురు ):**
ప్రస్తుతం అమలులో ఉన్న దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురానుంది. దీనిలో భాగంగా ఆదాయపు పన్ను (ఐటీ) నూతన బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చింది. విపక్షాల నిరసనల మధ్యే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో ప్రకటించిన మేరకు బిల్లును తీసుకుని వచ్చారు. అయితే విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. బిల్లుకు నిరసనగా వాకౌట్ చేయడం గమనార్హం. అనంతరం కాసేపటికే లోక్‌సభ మార్చి 10కి వాయిదా పడింది. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు ఇప్పుడు బిల్లును రూపొందించారు. ఈ చట్టాన్ని సమీక్షించడానికి కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేసింది. చట్ట సమీక్షకు 22 ప్రత్యేక సబ్ కమిటీలనూ ఏర్పాటు చేశారు. మొత్తం మీద కొత్త చట్టం సమీక్ష నిమిత్తం 6500 సలహాలను ఆదాయ పన్ను విభాగం అందుకుంది. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుని, కొత్త బిల్లు తీసుకొచ్చారు. మొన్నటి బడ్జెట్‌లో కూడా ఆదాయపు పన్న విషయంలో సరళీకరణ చేపట్టామని అన్నారు. అందుకు అనుగుణంగా కొట్ట ఐటి చట్టానికి ఇటీవలే కేబినేట్ ఆమోదించింది. దానికి చట్టబద్ధత కల్పించేందుకు పార్లమెంటు ముందుకు తీసుకుని వచ్చారు.

# మీరు చేసి చేసినా చూస్తూ ఊరుకోవాలా..?

- మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు మధ్య ముదురుతున్న వివాదం



**అమరావతి,ఫిబ్రవరి13( వెలుతురు ):**
దెందులూరు వైసీపీ మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మధ్య వివాదం మరింత ముదురుతోంది. వట్లూరులోని ఓ ఫంక్షన్ హాల్లో వీరి మధ్య రాజుకున్న వివాదం నియోజకవర్గ స్థాయి దాటి రాష్ట్రస్థాయిలో పొలిటికల్ హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ అరెస్టు పెను సంచలనం సృష్టిస్తోంది. కాగా, ప్రస్తుతం ఏలూరు జిల్లాలో వైసీపీ, టీడీపీ నేతల మధ్య ఘర్షణ వాతావరణం సైతం ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ..కొంతమంది తమ ఉనికి కాపాడుకోవడానికి సంచలనాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ నేతలు చేసిన అరాచకాన్ని ఏపీ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. చట్టం ప్రకారం కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఉద్దేశపూర్వకంగా నియోజకవర్గంలో గొడవలు సృష్టించేందుకు అబ్బయ్య చౌదరి ప్రయత్నించారని ఆరోపించారు. వైసీపీ నేతలు అలా చేస్తుంటే మేము చూస్తూ ఊరుకోనే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. ఘటనపై విచారణ చేపట్టి కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారని పేర్కొన్నారు. వాళ్లది దొంగల పార్టీ. మీకు సంస్కారం లేదు కాబట్టే సంస్కార హీనులుగా ప్రవర్తించారని దుయ్యబట్టారు.

# వర్క్‌ఫ్రమ్ కారు... టెక్కీకి వేయి జరిమానా

- బెంగళూరులో సంచలన కేసు



**బెంగళూరు,ఫిబ్రవరి13( వెలుతురు ):**
వర్క్‌ఫ్రమ్ హోమ్ అంటే కారులో డ్రైవ్ చేస్తూ..చేసే పనికాదని బెంగళూరు పోలీసులు గట్టి షాక్ ఇచ్చారు. రైళ్లు, బస్సుల్లో ప్రయాణిస్తూనే ఐటీ ఉద్యోగులు కొందరు ల్యాప్‌టాప్‌లో వర్క్ చేస్తూ ఉండటం మనం అప్పుడప్పుడు గమనిస్తున్నాం. అలా బెంగళూరుకు చెందిన ఓ మహిళ కూడా ప్రయాణవేళల్లో వర్క్ చేసింది. అయితే ఆ సమయంలో ఆమె కారు నడుపుతూ ల్యాప్‌టాప్‌లో వర్క్ చేయడం వివాదాస్పదమైంది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కాగా.. దీనిపై పోలీసులు చర్యలు చేపట్టారు. బెంగళూరులోని ఆర్టీ నగర్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ కారు డ్రైవ్ చేస్తూనే ల్యాప్‌టాప్‌లో వర్క్ చేస్తుంది. దీన్ని ఎవరో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. అదికాస్తా వైరల్‌గా మారి ట్రాఫిక్ పోలీసుల కంట పడింది. దీంతో ఆమెను ట్రాక్ చేసిన పోలీసులు వెయ్యి రూపాయిలు జరిమానా విధించారు. అంతేకాక.. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆ మహిళ వీడియోతో పాటు అదుపులోకి తీసుకున్న ఫొటోను ట్రాఫిక్ డీసీపీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది ఇంటి నుంచి చేసేది. కారు డ్రైవ్ చేస్తూ కాదు' అని రాసుకొచ్చారు. దీనిపై పలువురు నెటిజన్లు స్పందిస్తూ.. పోలీసుల చర్యకు అభినందనలు తెలుపుతున్నారు. మరోవైపు ఆ మహిళ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ కామెంట్లు పెడుతున్నారు. అలాగే పోలీసులను అభినందిస్తున్నారు.

# వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

- నిరసనల మధ్యే ప్రవేశ పెట్టిన ప్రభుత్వం
- గందరగోళం మధ్య సభ వాయిదా

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి13( వెలుతురు ):**
'వక్ఫ్ సవరణ బిల్లు-2024'పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. జేపీసీకి చైర్మన్‌గా వ్యవహరించిన జగదంబికా పాల్, బిజెపి ఎంపీ సంజరు తదితరులు ఈ ముసాయిదా బిల్లుపై తమ నివేదికను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సభ ముందుకు తీసుకొచ్చారు. ఈ బిల్లుపై నివేదికను రాజ్యసభ ఎంపీ మేధా కులకర్ణి సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. నివేదికపై ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. తాము సమర్పించిన డిస్సెంట్ (అసమ్మతి) నోట్‌ను తొలగించారంటూ నిరసనకు దిగారు. సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభను చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ 20 నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ ప్రతిపక్షాలు తమ నిరసనను కొనసాగించాయి. ఈ నిరసనల మధ్యే ఈ నివేదికకు రాజ్యసభ ఆమోదం తెలిపింది.



కాగా, జనవరి 29న ముసాయిదా నివేదికను జెపిసి ఆమోదించిన విషయం తెలిసిందే. బీజేపీ సభ్యులు సూచించిన 14 సవరణలను కమిటీ ఆమోదించింది. అయితే కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆప్, శివసేన(యూబీటీ), ఏఐఎంఐఎంతోసహా ప్రతిపక్ష సభ్యులు సూచించిన ప్రతి మార్పును కమిటీ తిరస్కరించింది. ఈ సవరణలతో వక్ఫ్‌బోర్డులలో ముస్లిమేతరులు కూడా సభ్యులుగా ఉంటారు. ఈ బిల్లుపై ముస్లింలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టి త్వరితగతిన ఆమోదింపజేసుకుంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com